## నీలగిరి నిత్యపద్యం

చిల్లిగవ్వగూడ చేతిలో లేకున్న
పడతులంత నేడు బస్సునెక్కి
రాష్ట్ర మంత తిరుగ ఇష్టానుసారమున్
ఉచితపథకములన యుత్సవముగ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 42 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | ఆగస్టు 10, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం**

- విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు
- జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా
- అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్


**అమరావతిఆగస్టు 9**
అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య

మిగతా 2లో.



## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా'
# కొత్త శక్తినిచ్చింది

- క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని
- ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- 'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా
- ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం



**ఢిల్లీ ఆగస్టు 9:**
చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు.ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం

మిగతా 2లో.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ
- దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి
- మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ



**కోల్‌కతా ఆగస్టు 9:**
పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు.

మిగతా 2లో.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి
# కేసీఆర్ పరామర్శ..



- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా

**నర్సంపేట ఆగస్టు 9 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా

మిగతా 2లో.

## రాజమండ్రి ఘటనలో గాయపడిన
# ప్రియాంక మృతి

- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్



**హైదరాబాద్ ఆగస్టు 9:**
రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

మిగతా 2లో.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు
- 14 రోజుల్లో 40 లక్షల కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ



2లో.

# బస్సులారీ ఢీ..
## 35 మందికి గాయాలు!

- పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం
- బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు



2లో.

# నేటితో సర్ ఆఖరు

- హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?.. ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!
- సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా
- సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు
- సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం
- ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా




2లో.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644

# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటి పేజీ తరువాయి**

అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు.

"సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది.." అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



### గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు.

ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

**మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట**

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు.

విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు.

వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవిని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

**జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు.

గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# రాజమండ్రి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

**మొదటి పేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు.

అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

### మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు

రాజమండ్రిలో కారు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్షించానని గుర్తుచేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్టు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న వారికి కఠిన శిక్ష పడేలా బలమైన సెక్షన్లు నమోదు చేయాలని సూచించారు.

# బస్సు లారీ ఢీ.. 35 మందికి గాయాలు!

**పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**
**ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం**
**బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు**

**పామిడి, ఆగస్టు 9:**

పామిడి మండలంలోని పొగరూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ బస్సు, ఐచర్ లారీ ఢీకొనడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది ప్రయాణికులు గాయపడగా.. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పొగరూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి చేరుకుంది. అదే సమయంలో వచ్చిన ఐచర్ లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది.

**క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు**

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొత్తం 35 మంది ప్రయాణికులకు



చికిత్స అందించగా.. 15 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

**క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్లు**

ప్రమాద తీవ్రతకు రెండు వాహనాల క్యాబిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోవడంతో పోలీసులు, సహాయక సిబ్బంది గ్యాస్ కట్టర్ల సాయంతో వాహన భాగాలను తొలగించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కూడా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

**నిద్రమత్తే కారణమా?**

అతివేగంగా ప్రయాణించడం, డ్రైవర్లు నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరూ మృతి చెందలేదని, క్షతగాత్రులందరికీ వైద్య చికిత్స అందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

**మొదటి పేజీ తరువాయి**

మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే" అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, 'డూ ఆర్ డై' (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

**మొదటి పేజీ తరువాయి**



సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

**మొదటి పేజీ తరువాయి**

పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జూ కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జూ, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు.

ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు.

ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి

# నేటితో సర్ ఆఖరు

**హైదరాబాద్ ఆగస్టు 9:**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ా×=) కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు**

**అమరావతిఆగస్టు 9:**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు.

ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

RNI - TELTEL/2023/87644

# ఎమ్మెల్యే కవ్వంపల్లి పై మాజీ ఎమ్మెల్యే రసమయి సంచలన ఆరోపణలు



**గన్నేరువరం, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గుండ్లపల్లి మాజీ సర్పంచ్ భర్త రాజేందర్ రెడ్డి ఆత్మహత్య ఘటనపై మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రసమయి బాలకిషన్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ ఘటనకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కారణమని ఆయన ఆరోపించారు. రాజేందర్ రెడ్డి హత్యాయత్నం ఫిర్యాదు చేసినప్పటికీ ఆయనపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం, అనంతరం క్యాంప్ కార్యాలయంలో వేధింపులు జరగడం వల్ల తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని రసమయి ఆరోపించారు. “ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక పెట్రోల్ పోసి నిప్పంటించారా..?” అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ ఘటనపై సీసీ కెమెరా ఫుటేజ్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వారం రోజుల్లో న్యాయం జరగకపోతే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాజేందర్ రెడ్డి భార్య బేతల్లి సమత మాట్లాడుతూ, “నా భర్తను కాపాడలేదు, నిందితులను కాపాడుతున్నారు” అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులు బయట తిరుగుతున్నారని, తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంప వెంకన్న, మాజీ జెడ్పీటీసీలు మాడుగుల రవీందర్ రెడ్డి, సిద్ధం వేణు, తాళ్లపల్లి శేఖర్ గౌడ్, పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, లింగాల మహేందర్ రెడ్డి, అటికం శ్రీనివాస్ గౌడ్, అటికం రవి, న్యాలపట్ల శంకర్ గౌడ్, బద్దం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే



**ఖానాపూర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు బొజ్జు పటేల్ సదర్ మార్ట్ కెనాల్, కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీటిని విడుదల చేశారు. సదర్ మార్ట్ ఆనకట్ట నుంచి ఖానాపూర్, కడం మండలాల్లోని 13,120 ఎకరాలకు నీరు అందించేందుకు కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కడెం ప్రాజెక్టు వద్ద మైసమ్మ ఆలయంలో పూజలు చేసి, ఎడమ కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని రైతుల సాగుకు విడుదల చేశారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో నీటి విడుదల కూడా ఆలస్యమైందని, రైతులు పొదుపుగావాడుకోవాలని ఆయన సూచించారు. కడెం ప్రాజెక్టు నిండు కుండలుగా ఉండటంతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మీ దయానంద్, చింతల మల్లేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిల్ శంకర్, కౌన్సిలర్ నిమ్మల రమేష్, రాజు రా సత్యం, నాయకులు గొర్రె గంగాధర్, ఓరుగంటి రాజేశ్వర్, కడార్ల గంగ నరసయ్య, జన్నారపు శంకర్, డి. రాజేశ్వర్, వెంకట్ గౌడ్, అమంద శ్రీనివాస్, అడ్వకేట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళు లర్పించారు. ఆయన మాట్లాడుతూ 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ ముంబై క్రాంతి మైదాన్‌లో భారత్ ఛోడో పిలుపునిచ్చారని, ఆ ఉద్యమం స్వాతంత్ర్యానికి నాంది పలికిందని గుర్తు చేశారు. ఆనాటి మహానాయకుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఉద్యమ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి, ముస్తాక్ అహ్మద్, కర్ర రాజశేఖర్, అహమ్మద్ అలీ, మూల కృష్ణారెడ్డి, వంగల విద్యాసాగర్, చర్ల పద్మ, బొబ్బిలి విక్టర్, అంజయ్య గౌడ్, శ్రీకాంత్, నిహాల్, అమరేందర్ రావు, అమీర్, కుంభాల రాజ్ కుమార్, వసీం, శిల్ప, మజీద్ అలీ ఖాన్, కలియుముద్దీన్, హాజీ షబానా, మహమ్మద్ అనీఫ్, మంద మహేష్, ఊకంటి రవీందర్ రెడ్డి, ఇమ్రాన్ గని, పెంట శేఖర్, బషీరుద్దీన్, అంజయ్య, రంగ నాయక్, హైమద్, కూన దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**మిర్యాలగూడ/పెద్దపల్లి, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మిర్యాలగూడ, పెద్దపల్లి పట్టణాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. మిర్యాలగూడలో రాజీవ్ చౌక్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లిలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ కార్యకర్తలే పట్టుకొమ్మలని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి యూత్ కాంగ్రెస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ భౌగోళిక రాజకీయాలపై సురేష్ కొచ్చాటిల్ విశ్లేషణ

**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో స్థానిక వైశ్యా భవన్లో ఆదివారం జరిగిన సెమినార్‌లో ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకుడు సురేష్ కొచ్చాటిల్ మాట్లాడుతూ ప్రపంచ భౌగోళిక రాజకీయాల మార్పులకు అనుగుణంగా భారత్ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ అవసరాల రీత్యా ఎవరితోనైనా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని, శాశ్వత శత్రు దేశం, శాశ్వత మిత్ర దేశం అనే భావన ఉండదని అన్నారు. ఇరాక్, ఇరాన్, ఇజ్రాయిల్, రష్యా వంటి దేశాల నుంచి మనం అవసరమైన వనరులు దిగుమతి చేసుకుంటున్నామని, అమెరికా--ఇరాన్ యుద్ధం సమయంలో ఆఫ్రికా దేశాల నుంచి గ్యాస్ దిగుమతి చేసి సంక్షోభాన్ని అధిగమించామని గుర్తు చేశారు. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల వల్ల పలు దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, భారత్ మోడీ ప్రభుత్వ వ్యూహాత్మక నిర్ణయాలతో ఆర్థికంగా స్థిరంగా ఉందని తెలిపారు. వంటనూనెల ధరలు పెరిగినప్పుడు ఇతర దేశాల నుంచి విత్తనాలు దిగుమతి చేసి సమస్యను పరిష్కరించిందని ఉదాహరణగా చెప్పారు. సోలార్ ఎనర్జీ, బ్యాటరీల అభివృద్ధి వంటి చర్యలు భవిష్యత్తులో ఇంధన కొరతను ఎదుర్కోవడానికి కీలకమని అన్నారు. ప్రజ్ఞాభారతి చైర్మన్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో భారత్ స్థానాన్ని బలపరచడానికి కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు సముద్రాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మందల నగేశ్ రెడ్డి, జె. సత్యనారాయణ రెడ్డి, గాజుల రవీందర్, వెచ్చ మురళి, ఎలగందుల సత్యనారాయణ, డి. శ్రీనివాస్, డా. గంద్ర లక్ష్మణరావు, ఉప్పు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
**- కొమురం భీం విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే**



**ఆమనగల్లు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆదివాసీ, గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆమనగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ కోఆర్డినేటర్ కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు దేశానికి గొప్ప సంపద అన్నారు. ప్రకృతిని పరిరక్షిస్తూ తమ సంస్కృతిని తరతరాలుగా కాపాడుతున్న గిరిజనుల రాజ్యాంగ హక్కులను కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన యువతకు మెరుగైన అవకాశాలు కల్పించి అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఆదివాసీల అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్, జిల్లా నాయకులు వస్పుల మానయ్య, అండేకర్ రాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు షాబుద్దీన్, వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, హరిలాల్ నాయక్, రాగ్య నాయక్, ఆనంద్ నాయక్, శీను నాయక్, సురేష్ నాయక్, రమేష్ నాయక్, గోపాల్ నాయక్, నాజర్, శివ, అంజాత్, కరీం, కుమార్ గౌడ్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# యువతతోనే కాంగ్రెస్‌కు బలం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
**- యూత్ కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**



**ఆమనగల్లు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీకి యువతే ప్రధాన బలమని, యూత్ కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు యువ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించేలా ప్రతి కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. రాబోయే రోజుల్లో పార్టీకి యువజన కాంగ్రెస్ కీలక శక్తిగా నిలవాలని, యువ నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, కార్యదర్శి వస్పుల మానయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, మెకానిక్ బాబా, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, ఖాదర్ ఖాద్రి, అండేకార్ రాజు, నియోజకవర్గ కార్యదర్శి కొప్పు రాఘవేందర్, ఉద్యమకారుడు పరమేశ్, తోట శ్రీను, కరీం, సలీం, అంజాత్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి రేఖ్యతాండ సర్పంచ్, వార్డు సభ్యులు

**- ఎమ్మెల్యే కసిరెడ్డి సమక్షంలో భారీగా చేరికలు**
**- కొత్త చేరికలతో కడ్తాల్‌లో పార్టీకి మరింత బలం**

**ఆమనగల్లు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. రేఖ్యతాండ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాత్లావత్ లక్ష్మి శ్రీధర్‌తో పాటు వార్డు సభ్యులు లలిత, శ్రీను, ఎస్. విజయ, కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజా పాలన కొనసాగిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్తగా చేరిన నాయకులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు పోతుగంటి శంకర్, కృష్ణ, శ్రీను, గంగులు, సోమ్లా, దాస్య, రమేష్, రవి, గణేష్, నరేష్, పాండు, కిరణ్, వాసు, హరి, వినోద్, పవన్, శ్రీధర్‌తో పాటు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పకీర తండాకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తాగునీటి భరోసా

**- రూ.1.50 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు**

**ఆమనగల్లు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలం పకీర తండా ప్రజల తాగునీటి సమస్యను గుర్తించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్పందించారు. ఐక్యత ఫౌండేషన్ సహకారంతో రూ.1.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల తండాలు, గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పకీర తండాతో పాటు నియోజకవర్గంలోని ప్రతి మారుమూల తండా, గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం పకీర తండాలో ఘనంగా నిర్వహించిన సీత్ల భవానీ పండుగ వేడుకల్లో రాఘవేందర్ రెడ్డి ప్రజలతో కలిసి పాల్గొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తండా ప్రజల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో తమ తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని తండావాసులు రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద శ్రీను, ఉపసర్పంచ్ రాజేందర్ నాయక్, మాజీ సర్పంచ్ పద్మ జగదీష్, వార్డు సభ్యులు బుజ్జి, రవి, లచ్చి, మాజీ వార్డు సభ్యులు భీక్య, రాజు, బీక్కి, ఐక్యత ఫౌండేషన్ మాడుగుల ఇన్‌చార్జి సూదిని జైపాల్ రెడ్డితో పాటు తండా ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వెల్దండ, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హరికిషన్ నాయక్ కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు మాట్లాడుతూ, "ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడానికి యువత కృషి చేస్తుంది. ప్రతి కార్యకర్త పార్టీ జెండా ఎగురవేయాలని లక్ష్యంగా పనిచేయాలి" అని పేర్కొన్నారు. మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి యువత కృషి చేయాలని, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుల్ సింగ్ నాయక్, శీను, మల్లయ్య, జంగిలి ఆనంద్, గోసుల కొండయ్య, కాషారపు వెంకటయ్య, తారా సింగ్, దుర్గయ్య, దూల చంద్రశేఖర్, రేవెల్లి రాజు, సతీష్, మట్ట శివ గౌడ్, ఎండి సమీర్, ఈదులపెల్లి శ్రీనివాస్, పుట్ట శివ, డేవిడ్, మాదుగుల రమేష్, గుద్దటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ భారీగా నీరు వృధా



**వెల్దండ, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మహాత్మా గాంధీ తండా మధ్యలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ ఏర్పడింది. లీకేజీ కారణంగా పెద్ద ఎత్తున నీరు పొలాల్లోకి చేరిపోతోంది. అసలే ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తున్న సమయంలో, ఈ నీటి వృథా తండావాసులను ఆందోళనకు గురి చేస్తోంది. ప్రజలు అధికారుల తక్షణ స్పందన కోరుతూ, పైప్ లైన్లను బాగు చేసి నీటి వృథాను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఈగ మల్లేశం



**వర్ధన్నపేట , ఆగస్టు 9(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** గుండెపోటుతో మృతి చెందిన సట్ల యాదగిరి గౌడ్ కుటుంబాన్ని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన సట్ల యాదగిరి గౌడ్ ఇటీవల గుండెపోటు తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఈగ మల్లేశం, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంచాల కుమారస్వామి,బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు అడుప రాజు, ఇల్లంద గౌడ సంఘం అధ్యక్షులు సమ్మెట సూర్యనారాయణ, సట్ల సదానందం ,చిర్ర గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎస్ఈఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం

**న్యూ ఢిల్లీ, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఢిల్లీ యూనివర్సిటీ కమ్యూనిటీ హాల్‌లో ఇండి యన్ పబ్లిక్ సర్వీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశం విజయవంతంగా ముగిసింది. జాతీయ కార్యదర్శి ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ప్రతినిధులు హాజరయ్యారు. తెలం గాణ తరఫున టీఆర్టీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కట కం రమేష్, ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు కె. సుబ్బారెడ్డి పాల్గొని ఉపాధ్యాయుల సమస్య లను జాతీయ వేదికపై బలంగా వినిపి ంచారు. సమావేశం ప్రధానంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్రీకృతమైంది. ఈ విధా నాలను తీవ్రంగా ఖండిస్తూ, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ స్థాయిలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలని ప్రతినిధులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. తక్షణమే నూతన పే రివిజన్ కమిషన్ అమలు చేయాలని, ఎన్పీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్ కాకుండా శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని పట్టుబట్టారు. సమాన పనికి సమాన వేతనం కల్పించడంతో పాటు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, అంగన్వాడీ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించాలని తీర్మానించారు. ఈ డిమాండ్ల సాధన దిశగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు త్వరలోనే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ స్థాయి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ భవిష్యత్తులో నిరంతర పోరాటాలకు సిద్ధమని, ఉద్యమ కార్యాచరణ ద్వారానే తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకుం టామని కటకం రమేష్ మరియు ఇతర సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

## ఎలిగేడులో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు



**ఎలిగేడు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పద్మశాలి కుటుంబాల నుండి ఇంటికో బోనం చొప్పున మహిళలు తలపై ఎత్తుకొని, బైండ్ల పూజారుల డప్పు చప్పుళ్ల మధ్య ప్రధాన రహదారి గుండా ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి, ఆలయ ఆవరణలో బోనాలను సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పెద్దలు, నాయకులు, మహిళలు, చిన్నారులు పాల్గొని ఉత్సవాన్ని మరింత వైభవోపేతంగా తీర్చిదిద్దారు.



## గ్రామ కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్ సమీక్ష

- కార్యకర్తల అభిప్రాయాల సేకరణ.. ఆశావహుల పేర్ల నమోదు
- కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యత
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్



**ఐనవోలు, ఆగస్టు 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఐనవోలు మండలంలోని గ్రామ కమిటీల ఏర్పాటు సందడిగా మారింది. ఐనవోలు మండలంలోని పెరుమాండ్లగూడెం, నందనం, రాంనగర్, ఉడుతగూడెం, లింగమోరుగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటు ప్రక్రియపై ఆదివారం సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కమిటీల నిర్మాణం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, మాజీ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు కమిటీ ఇన్‌చార్జుల సమక్షంలో ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. గ్రామ కమిటీ అధ్యక్ష పదవులతో పాటు వివిధ బాధ్యతలకు ఆసక్తి చూపుతున్న ఆశావహుల పేర్లను నమోదు చేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు మోహన్ గౌడ్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ అధిష్టానం తుది నిర్ణయం మేరకు కమిటీల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సమావేశాల్లో ఆయా గ్రామాల సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**దేవరకొండ, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యువతను రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం చేసి దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఏర్పడిన యువజన కాంగ్రెస్ ప్రజాసేవలో ముందుండాలని దేవరకొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ అన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి బాలింతలను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. హరికృష్ణ మాట్లాడుతూ, "యువజన కాంగ్రెస్ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి అనుబ ంధంగా యువతను ప్రజాసేవ వైపు నడిపించే శక్తివంతమైన వేదిక. ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం, సమాజంలో జరుగుత ున్న అన్యాయాలపై ప్రశ్నించడం, ప్రజలకు అండగా నిలవడం యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. యువత రాజకీయాల్లోకి రావడం అంటే పదవుల కోసం కాదు, ప్రజల కోసం పనిచేసే బాధ్యతను స్వీకరించడం" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ బలమైన వెన్నెముక లాంటిదని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో యువతను ఏకం చేసి, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవలో భాగంగా పేదలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, రైతులు, కార్మికులకు అండగా నిలవాలని, అత్యవసర సమయాల్లో సహాయం చేయడంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలని ఆయన సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మార్గదర్శకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని హరికృష్ణ కోరారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మేడ సైదులు, నేనావత్ మోతిలాల్, ఉపాధ్యక్షుడు కేతావత్ రమేష్, ప్రధాన కార్యదర్శులు ఏకుల అంబేద్కర్, ఉమేర్ ఖాసీం, దుబ్బ చరణ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగటి హరీష్, మండల అధ్యక్షులు ముకురోజు రాజు, సాయి రాథోడ్, నీలం ఆంజనేయులు యాదవ్, రమేష్ నాయక్, మహ్మద్ ఇస్మాయిల్తో పాటు సర్పంచులు, నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలు



**ఖానాపూర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ పట్టణంలోని కొమురం భీం చౌరస్తాలో ఆదివాసీలు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు బొజ్జు పటేల్ కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఎగురవేసి, డప్పు చప్పుళ్లతో ఆదివాసీలు నృత్యాలు చేస్తూ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల పోడు భూముల సమస్యను అటవీశాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పోడు పట్టాలు, పోడు వ్యవసాయం చేస్తున్న రైతులకు విధించిన కఠిన నిబంధనలను ఎత్తివేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య, కౌన్సిలర్ నిమ్మల రమేష్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, మస్కాపూర్ సర్పంచ్ దొనికెన్ని లక్ష్మీ దయానంద్, గాజుల గంగన్న, నిమియా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగిల్ శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



**ఖానాపూర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పద్మశాలి సంఘం విద్యానగర్--2 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి వి. శ్రీనివాస్, సహాయ అధికారి ఎనిగందుల నారాయణ ఆధ్వర్యంలో ఎన్నికలు జరి గాయి. గౌరవ అధ్యక్షుడిగా వడ్లకొండ రా జన్న, అధ్యక్షుడిగా ఎనుగందుల రమణయ్య, ఉపాధ్యక్షులుగా సిలారి రవి, మాసవత్తి రమేష్, ఎనిగందుల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మామిడాల రమేష్, సహాయ కార్యదర్శులుగా నల్ల నాగరాజు, శ్యామల ప్రభాకర్, కోశాధికారిగా శైలేంద్ర కన్నయ్య, సహాయ కోశాధికారిగా దానిపల్లి సుధాకర్, ప్రచార కార్యదర్శిగా అంకం పోశెట్టి, సోషల్ మీడియా ప్రతినిధిగా వడ్లకొండ భూమన్నను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా వి. శ్రీనివాస్, కంఠం రవిందర్, చుక్కల రాజేశ్వర్, కొండ నారాయణ ఆర్టీసీ ఎంపికయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని, సభ్యులందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు.

## ఘనంగా పదవి విరమణ కారక్రమం



**ఖానాపూర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పదవీ విరమణ పొందిన డిటిఓ అధికారి కొండూరి బ్రహ్మయ్యకు నిర్మల్ పట్టణంలోని దుర్గామాత ఆలయంలో ఘన సన్మానం జరిగింది. రిటైర్డ్ ఉపాధ్యాయుడు బ్రహ్మశ్రీ కొండూరి వెంకటాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య సతి సమేతంగా పాల్గొన్నారు. ఆయన సేవలను కొనియాడుతూ జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ బ్రహ్మయ్య గారి సేవలు ప్రజ్ఞాశీలిగా నిలిచాయని, వంశానికి గర్వకారణమని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో కొండూరి సాయి ప్రసాద్, నరసింహాచారి, మనోహర్ చారి, శ్రీనివాస్ చారి, చంద్రమోహన్ చారి, సమస్త కొండూరి వంశస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం



**ఖానాపూర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ పట్టణంలో ఆదివాసీలు ర్యాలీగా వెళ్లి తెలంగాణ తల్లి చౌరస్తాలో జెండా ఆవిష్కరించారు. "జల్, జంగల్, జమీన్ హమారా హోయ్" అంటూ జోహార్లు పలుకుతూ ఆదివాసీ ఐక్యతను చాటారు. కొమురం భీం నినాదాలతో దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య, బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ రాజా గంగన్న, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## సాధన స్కూల్‌లో ఘనంగా బోనాల సంబరాలు



**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆషాడ బోనాల పండుగను కరీంనగర్ జ్యోతినగర్‌లోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్లు, బోనాల పాటలతో పాఠశాల ప్రాంగణం భక్తిమయ వాతావరణంగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. సి. హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, భావి తరాలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో ఇలాంటి వేడుకలు అవసరమని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ డా. సి. హెచ్. శ్రీనివాసరావు, హైస్కూల్ ప్రిన్సిపల్ వి. కుమారస్వామి, ప్రైమరీ ప్రిన్సిపల్ ధనలక్ష్మి, పి. ఈ. టి జి. నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
సోమవారం,
ఆగస్టు 10, 2026



# డబుల్ బెడ్ రూమ్ అసోసియేషన్ సమీక్ష సమావేశం నిర్వహణ



**బోడుప్పల్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బోడుప్పల్ సర్కిల్--10 పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో ఆదివారం డబుల్ బెడ్ రూమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. డబుల్ బెడ్‌రూమ్ సమస్యలు, పరిష్కారాలు, రాబోయే బోనాలు, రాఖీ పండుగల నిర్వహణపై చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ దానగాళ్ల అనిత యాదగిరి మాట్లాడుతూ ప్రజలు ఐకమత్యంతో కలసి ఉండాలని, మౌలిక వసతుల విషయంలో వెనకడుగు వేయబోమని అన్నారు. రాబోయే పండుగలను అందరూ కలసి జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్

**ఎలిగేడు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నర్సాపూర్ గ్రామ సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్ తెలిపారు. ఆదివారం గ్రామంలోని వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# వైభవంగా వనభోజనాలు



**ఎలిగేడు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆషాడ మాసంలో ప్రతి యేటా నిర్వహించే వనభోజనాలను ఆదివారం ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో పంబాల కులస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఎల్లమ్మతల్లి ఆలయానికి తరలివెళ్లిన గ్రామస్థులు వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు--పశువులు బాగుండాలని మొక్కులు చెల్లించారు. అనంతరం వంటలు చేసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో దేవ లింగయ్య, దేవ రాజు, రమేశ్, శ్రీను, రాజయ్య, ఆంజనేయులు, అజయ్, ప్రదీప్, రామకృష్ణ, అనిల్, శ్రీవర్షిత్, సాయి, శ్రీధర్‌తో పాటు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# ఈనెల 11న మండల సర్వసభ్య సమావేశం



**ఎలిగేడు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎలిగేడు మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగనుందని ఎంపీడీవో బాస్కర్ రావు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి, మండల ప్రజాపరిషత్ అధికారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఘనంగా మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు




**ఎలిగేడు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినాన్ని అభిమానులు ఎలిగేడు మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వాల్మీకిబోయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప సర్పంచ్ గుడుగుల మహేందర్ మాట్లాడుతూ మహేష్ బాబు సినీ నటుడిగానే కాకుండా సమాజ సేవలోనూ ముందుంటారని, తన సంపాదనలో కొంత భాగాన్ని చారిటీలకు, చిన్నారుల గుండె శస్త్రచికిత్సలకు, స్వగ్రామమైన బుర్రిపాలెం అభివృద్ధికి వినియోగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకిబోయ సంఘం అధ్యక్షుడు ముత్కల మల్లేశం, అభిమానులు తాటిపల్లి సతీష్ బాబు, వంశీకృష్ణ, సాయితేజ, విశాల్, కేశెట్టి లక్ష్మన్ కుమార్, మండిగ ప్రవీణ్, కవ్వంపల్లి సాయి, సుంక సంతోష్, కట్ల కుమార్, అడ్డగుంట సంపత్, బాలు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక పూజలు





**షాద్‌నగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డులోని సాయి బాబా కాలనీ పోచమ్మతల్లి దేవాలయంలో బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస వేశ్వర్, కౌన్సిలర్ డి. రాజు నాయక్ పాల్గొ న్నారు. అనంతరం జెండా ఆవిష్కరణతో పాటు భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు లత శ్రీశైలం గౌడ్, సయ్యద్ ఖదీర్, చెంది తిరుపతి రెడ్డి, ముబారక్ అలీ ఖాన్, సాదిక్, అనిల్ కుమార్, జయప్రకాష్, రాయికల్ శ్రీనివాస్, కరుణాకర్, బుచ్చయ్య, శ్రీధర్ రెడ్డి, కుమారస్వామి గౌడ్, రమేష్, సీతారాం, శేఖర్‌తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి సీఐటీయూ




**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గంగాధర మండల కేంద్రంలో ఆదివారం జరిగిన గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో సిఐటియు నాయకులు కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, జగిత్యాల జిల్లా కార్యదర్శి కోనేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 19న మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయాల ముందు, ఆగస్టు 24 నుంచి 26 వరకు కలెక్టరేట్ వద్ద మూడు రోజుల దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, అందుకే దశలవారీగా ఆందోళనలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎండిగా రవీందర్‌రావు, కమిటీ సభ్యులు కాష్పాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, గంధసిరి సంపత్, కొత్తూరు మల్లయ్య, ఇమ్మడి శ్రీకాంత్, మేకల కమలాకర్, సుంకపాక హరీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలని బీజేపీ పిలుపు



**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా అభియాన్‌ను కరీంనగర్ జిల్లాలో విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. ఆదివారం శుభ మంగళ కన్వెన్షన్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 10 నుండి తిరంగా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషుల విగ్రహాలు, స్మారక చిహ్నాల వద్ద పరిశుభ్రత కార్యక్ర మాలు చేపట్టాలని, ప్రతి గ్రామంలో తిరంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహి ంచాలని సూచించారు. జాతీయ పతాకం దేశ ఐక్యతకు ప్రతీక అని, స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలు దేశభక్తిని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బాస సత్యనారాయణ రావు, కన్న బోయిన ఓదెలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయిని మల్లేశం, గంగాడి కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు.

# విజయవంతంగా ముగిసిన సబ్ జూనియర్స్ చెస్ ఛాంపియన్‌షిప్

**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మల్లమ్మ మార్కెట్‌లోని విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్స్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజ ేశారు. ఈ కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్ విశ్వనాథ్ ప్రసాద్, కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ జార్జ్ రెడ్డి, జిల్లా అసోసియేషన్ రాజేంద్ర ప్రసాద్, కోచ్ శివయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



# టిడిపి డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహణ



**నందికొట్కూరు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీఆర్ఆర్ నగర్‌లో ఆదివారం టిడిపి డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహిం చారు. రెండేళ్ల టిడిపి పాలనలో అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని 47వ బూత్ ఇంచార్జి, పట్టణ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఎస్. గోవర్ధనగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలు చంద్రబాబు నాయుడు పాలన లోనే జరిగా యని, నందికొట్కూరు పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో 48వ బూత్ ఇంచార్జి ఆర్. నవీన్ కుమార్, టిడిపి సీనియర్ నేత చిన్న బ్రహ్మయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



**నందికొట్కూరు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొద్దిరోజుల క్రితం ప్రమాద వశాత్తు గాయపడి చికిత్స పొందుతున్న నందికొట్కూరు తహసీల్దార్‌ను ఆదివారం ఎమ్మెల్యే గిత్త జయసూర్య పరామర్శి ంచారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని యోగక్షేమాలు విచారించారు.

# మైసమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పించిన ఎమ్మెల్యే

**పెద్దపల్లి, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించే కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు ఆదివారం అల్జీయా కోట్ల శ్రీ కోట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి రాష్ట్ర ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, హైదరాబాద్‌లోని ప్రసిద్ధ దేవాలయాలకు ఆర్థిక సహాయం అంద జేస్తోం దని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# రిజర్వాయర్ నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేసిన ప్రజలు



గంగాధర, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడంతో రైతాంగం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గతంలో నిర్వాసితుల పరిహారం కోసం రూ.23.50 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. తాజాగా రిజర్వాయర్ కట్ట మరమ్మతులు, గ్రావిటీ కాలువలు, బండ్ పటిష్ఠం వంటి పనుల కోసం నిధులు విడుదల చేయడం పట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్ పనులు పూర్తయితే చొప్పదండి, పరిసర ప్రాంతాల్లోని వందలాది గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శ్రమను కొనియాడుతూ, నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గార్లకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల విడుదలతో ప్రాజెక్టు పనులు వేగవంతమై సుమారు 49,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని, భూగర్భ జలాలు పెరిగి మరో లక్ష ఎకరాలకు మేలు జరుగుతుందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టొద్దు సునీల్ రావు

**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగర అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జరుగుతుందని చెప్పే కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మండిపడ్డారు. ఆదివారం ఎస్‌బిఎస్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన, ఇప్పటివరకు నగర అభివృద్ధి స్మార్ట్ సిటీ, అమృత్, యూఐడిఎఫ్, ఆర్వోబి, సిఆర్ఎఫ్, యూసిఎఫ్ వంటి కేంద్ర పథకాల ద్వారానే జరిగిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా కరీంనగర్ అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించలేదని విమర్శించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జ్, స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల నిధులు అన్నీ కేంద్రం నుంచే వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం వాటా ఆలస్యమేనని అన్నారు. ప్రజలను మభ్యపెట్టే వ్యాఖ్యలు మానుకుని, ప్రత్యేక పథకం ద్వారా నిధులు తెచ్చి చూపాలని కాంగ్రెస్ నాయకులను సవాల్ విసిరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గాజ రామశివరాం, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మి ప్రకాష్, కొంపెల్లి శ్వేత రామణ్, పొన్నం లక్ష్మి మొం దయ్య గౌడ్, కొలిపాక రమ్య శ్రీనివాస్, బీజేపీ నాయకులు కుంభం అనిల్, పండుగ నాగరాజ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కులవ్యవస్థ అనే అసమానతను నిర్మూలించడమే సామాజిక న్యాయం

**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** "78 ఏళ్ల స్వాతంత్ర్యం -- సామాజిక న్యాయం" అంశంపై ఆదివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో సెమినార్ జరిగింది. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కులవ్యవస్థ అనే అసమానతను నిర్మూలించడం ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవు తుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, రిజర్వేషన్లను రద్దు చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. యువతరం ఐక్యంగా ఉద్యమించి అసమానతల నిర్మూల నకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ దళితుల అసైన్డ్ భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం విద్యార్థి యువతరం ఉద్య మాలు చేపట్టాలని సూచించారు. కార్యక్ర మంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు గాజుల కనకరాజు, గోవర్ధన్, విజయ, శ్రీకాంత్, కుమార్, సదానందం, సంకీర్త్ తదితరులు పాల్గొన్నారు.




# బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం



**కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా బీజేపీ కొత్త అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశంను ఆదివారం రామ్‌నగర్ మార్క్‌ఫెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు ప్రమోద్ రావు, ప్రధాన కార్యదర్శి గిరి నరేందర్, అధిరెడ్డి వెంకటేశం, రవీందర్‌తో పాటు సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అసోసియేషన్లు, బీజేపీ నాయకులు కూడా సాయిని మల్లేశంను సన్మానించారు. కొత్త యస్వాడలో జరిగిన బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అదే రోజు బీజేపీ ఈస్ట్ జోన్ అధ్యక్షుడు అవదుర్తి శ్రీనివాస్ తండ్రి మరణం నేపథ్యంలో సాయిని మల్లేశం వారి కుటుంబాన్ని పరామర్శించి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## మాల సంఘం నూతన అధ్యక్షుడిగా తాళ్ల నర్సయ్య నియామకం



గంగాధర, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండల మాల సంఘం అధ్యక్షుడిగా తాళ్ల నర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ప్రధాన కార్యదర్శిగా తాళ్ల రమేష్, ఉపాధ్యక్షులుగా తాళ్ల శ్రీనివాస్, కోశాధికారిగా తాళ్ల బాబు, ప్రచార కార్యదర్శిగా కోరవేణి నవీన్ ఎంపికయ్యారు.ఈ ఎన్నికల్లో సంఘ సభ్యులంతా పాల్గొన్నారు.

## వైద్యుల రక్షణే ఆరోగ్య సేవల పరిరక్షణ: డాక్టర్ కవిత



కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో దారుణంగా ప్రాణాలు కోల్పోయిన యువ వైద్యురాలు అభయ జ్ఞాపకార్థం ఆదివారం కరీంనగర్ ఆబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ సొసైటి ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సొసైటి అధ్యక్షురాలు డాక్టర్ వి. కవిత మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, వైద్యులపై హింసను అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్య కార్యకర్తలను రక్షించడం అంటే ఆరోగ్య సేవలను రక్షించడమేనని అన్నారు.కార్యక్రమంలో సొసైటి కార్యదర్శి డాక్టర్ పూర్ణిమా, కోశాధికారి డాక్టర్ శృతి, డాక్టర్లు ఎడవెల్లి శైలజ, రమదేవి, మేఘన, చేతన, సర్దార్ హన్సినా, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పద్మశాలి వనభోజనాల 17వ వార్షికోత్సవం



కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దేవుళ్ళపురి శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో ఆదివారం పద్మశాలి వనభోజనాల 17వ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది.శివభక్త మార్కండేయ ట్రస్ట్ ఫౌండర్ చిలుక నరసప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చిలుక నరసప్ప మాట్లాడుతూ కులబాంధవుల మధ్య ఐక్యత, ఆత్మీయత పెంపొందించేందుకే వనభోజనాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు, పిల్లల కోసం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, కుల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత - భీమా సాహెబ్



కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమా సాహెబ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన గిరిజన హక్కులను ప్రభుత్వాలు కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, అటవీ సంరక్షణ చట్టం 2023 పేరుతో గిరిజనులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమను పూర్తి చేస్తే వేలాది గిరిజన యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొన్నారు.విద్య, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం కృషి చేయకపోతే గిరిజన యువత ఉద్యమానికి పూనుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నగర అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, కిరణ్, శ్రీనాథ్, సురేష్, శ్రీకాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాల జాతర



కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఆషాఢమాస బోనాల పండుగను పురస్కరించుకొని నగరంలోని భగత్‌నగర్, రాంచంద్రాపూర్ కాలనీల మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాల జాతర ఘనంగా జరిగింది.ఈ వేడుకలకు మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సునీల్ రావు స్వయంగా నెత్తిన బోనం ఎత్తి ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ప్రజల ఐకమత్యానికి నిదర్శనమని అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు సొగాని కొమురయ్య, నలువాల రవీందర్, చొప్పరి జయశ్రీ--వేణు, పొన్నం లక్ష్మి--మొండయ్య గౌడ్, సంఘ సభ్యులు, కుల పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రజక సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



ఖానాపూర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శ్రీ మడేలేశ్వర స్వామి పండుగను పురస్కరించుకొని ఆదివారం ఖానాపూర్ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా దొనకంటి లింగేశ్, కార్యదర్శిగా మలికిరి నరేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా తాళ్ల శ్రీనివాస్, కోశాధికారిగా తాళ్ల బాబు, ప్రచార కార్యదర్శిగా కోరవేణి నవీన్ ఎంపికయ్యారు.నూతన అధ్యక్షుడు దొనకంటి లింగేశ్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శులను సంఘ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## మౌలిక వసతుల లోపంపై సిపిఎం ఆగ్రహం



నందికొట్కూరు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మిడుతూరు మండలం వీపనగండ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీ అంబేద్కర్ నగర్‌లో సిపిఎం నాయకులు పర్యటించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా గ్రామంలో వీధిలైట్లు, డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 దళిత కుటుంబాలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్ల ముందు బురద, దోమల సంచారం వల్ల ప్రజలు అంటురోగాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎన్. కుమార్, రాజు, చిన్నబాబు, సంజన, పాపన్న, రమణమ్మ, సువర్ణమ్మ, మార్తమ్మ, సమాధానమ్మ, కర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జైల్ భరో విజయవంతం చేయాలని సిపిఐ పిలుపు




నందికొట్కూరు, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): క్విట్ ఇండియా డే సందర్భంగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరగనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.ఈ సందర్భంగా లిబరేషన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని విమర్శించారు. అమెరికా--భారత్ వాణిజ్య ఒప్పందం వల్ల రైతులు నష్టపోతారని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, కొత్త విద్యుత్ చట్టం--2025, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అసంఘటిత కార్మికులకు నెలకు రూ.36,000 వేతనం ఇవ్వాలని కోరారు. వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని, అప్పుల ఊబిలో ఉన్న రైతాంగానికి సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. "వ్యవసాయాన్ని కాపాడుకుందాం -- భూమిని కాపాడుకుందాం -- రైతును కాపాడుకుందాం" అనే నినాదంతో ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కాటేపోగు స్వామన్న, మిడుతూరు మండల కార్యదర్శి మేకల చంద్రశేఖర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్య కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం



ఆమనగల్లు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కడ్తాల్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వారం రోజుల క్రితం మృతి చెందిన గండికోట బాలయ్య కుటుంబాన్ని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించారు. బాలయ్య చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుమారుడు గండికోట మహేష్‌కు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి తరపున రూ.10 వేల సాయం అందించడంతో మొత్తం రూ.40 వేల ఆర్థిక సహాయం చేశారు. కుటుంబానికి అండగా నిలిచేందుకు తమ వంతు సహాయాన్ని అందించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు భవిష్యత్‌లోనూ సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పిప్పళ్ళ శ్రీకాంత్, కేశని శంకర్, ఓర్సు మల్లేష్, వరికుప్పల మల్లేష్, బోసు శ్రీశైలం, ము చ్చర్ల రాజు, గండికోట శ్రీను, ఓర్సు మహేష్, ఇమిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాసు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన సుంకిరెడ్డి



ఆమనగల్లు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, లింగారావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి సీతమ్మ ఇటీవల మృతి చెందడంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆదివారం రామకృష్ణాపురంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను కలిసి సీతమ్మ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. మాతృమూర్తిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అన్నారు. సీతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, జగన్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బొచ్చుపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తరుణ్ ఏకగ్రీవ ఎన్నిక



ఆమనగల్లు, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రతిభ నగర్ కాలనీలో గణేశ్ శివశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తరుణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు, యువత తరుణ్‌కు అభినందనలు తెలిపారు. యువతను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తరుణ్ తెలిపారు. కాలనీ అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు. యువ తలో ఐక్యత, సేవాభావాన్ని పెంపొంది ంచేలా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అసోసి యేషన్ సభ్యుల సహకారంతో బాధ్య తలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తరుణ్ పేర్కొన్నారు.

## ఘనంగా ముత్యాల పోచమ్మ బోనాలు



పెద్దపల్లి, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆషాఢ మాసం చివరి ఆదివారం స్థానిక ముత్యాల పోచమ్మ వాడ ఆధ్వర్యంలో బోనాల జాతర ఘనంగా జరిగింది.డప్పు మేళాలు, నృత్యాలతో ఊరేగింపుగా జండా వద్ద నుంచి ముత్యాల పోచమ్మ తల్లి గుడి వరకు బోనాలు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వాడ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు



కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నగరంలోని 39, 10, 9వ డివిజన్లలో ఆదివారం పోచమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి.9, 10వ డివిజన్ పరిధిలో కొత్తగా ప్రతిష్ఠించిన శ్రీ ధన మైసమ్మ దేవాలయాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ కొమురన్నా, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్ దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.అలాగే 39వ డివిజన్‌లోని వరాల మైసమ్మ దేవాలయం, పోచమ్మ వాడ, భగీరథ కాలనీ, వరసిద్ధి కాలనీలలో జరిగిన బోనాల మహోత్సవాల్లో కార్పొరేటర్ మాసం గణేష్ పాల్గొని ప్రజలతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.?

## మాదిగ స్మశాన వాటికల అభివృద్ధిపై అధికారుల నిర్లక్ష్యం



పెద్దపల్లి, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మాదిగల స్మశాన వాటికల అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐఎఫ్బీ పెద్దపల్లి పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్ విమర్శించారు. ఇప్పటికే నిధులు కేటాయించినప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించకపోవడం, అవకతవకలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.స్మశాన వాటికలకు మౌలిక వసతులు కల్పించి, అభివృద్ధి పనులు తక్షణమే చేపట్టాలని, కేటాయించిన నిధుల వినియోగంపై సమగ్ర పరిశీలన జరిపి అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని, వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్



కరీంనగర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి బోనం ఎత్తుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తాయని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.బోనాల ఉత్సవాలు సమాజంలో ఐక్యత, సామరస్యం, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని, తెలంగాణ సంస్కృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మేయర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు మాసం గణేష్, చొప్పరి జయశ్రీ, సొగాని కొమురయ్య, నలువాల రవీందర్, పొన్నం లక్ష్మి--మొండయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యం ఉచితంగా ఇవ్వలేదని వైన్‌షాప్‌లో దౌర్జన్యం



పెద్దపల్లి, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మద్యం ఉచితంగా ఇవ్వలేదన్న కారణంతో ముగ్గురు వ్యక్తులు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని హన్మంతునిపేటలోని లక్ష్మీ గణపతి వైన్‌షాప్‌లోకి చొరబడి దౌర్జన్యానికి పాల్పడ్డారు.వైన్‌షాప్ నిర్వాహకుడు విద్యాసాగర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, నిందితులు షాప్ గ్రిల్, సీలింగ్ ఫ్యాన్, మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి, హత్య చేస్తామని బెదిరించారు. ఈ ఘటనలో షాప్‌కు భారీ ఆస్తి నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు.గతంలో కూడా ఇలాంటి ఇబ్బందులు కలిగించినప్పటికీ ఈసారి ప్రాణహాని బెదిరింపులు, ఆస్తి నష్టం జరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజ్, ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, నిందితులపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన భూక్య జాన్సన్



ఖానాపూర్, ఆగస్టు 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ ఆదివాసీ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు.ప్రకృతిని పరిరక్షిస్తూ తమ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను తరతరాలకు అందిస్తూ భారత వైవిధ్యానికి ప్రతీకగా నిలిచిన ఆదివాసీల సేవలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సమగ్ర అభివృద్ధి, స్వయం నిర్ణయాధికారాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ప్రకృతి మాత బిడ్డలైన ఆదివాసీ, గిరిజన సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## చిగురుమామిడిలో దివ్యాంగుడిపై దాడి ఇద్దరిపై కేసు నమోదు

**చిగురుమామిడి, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉల్లంపల్లి గ్రామంలో దివ్యాంగుడు కాశవేణి రాకేష్పై దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై జేరిపోతుల వెంకటస్వామి, నర్సింగోజు విజయ్లపై చిగురుమామిడి పోలీసులు కేసు నమోదు చేశారు.ఫిర్యాదు ప్రకారం, ఈ నెల 7వ తేదీ ఉదయం రాకేష్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి అసభ్య పదజాలంతో దూషించి, ఛాతిపై దాడి చేసినట్లు ఆరోపించారు. గ్రామ వాట్సాప్ సమూహంలో అవమానకర వ్యాఖ్యలు చేసి బెదిరింపులకు పాల్పడినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు పోలీసులు నేరం నంబర్ 148/2026 కింద కేసు నమోదు చేసి, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్లతో పాటు దివ్యాంగుల హక్కుల చట్టం సెక్షన్ 92(బి) కింద దర్యాప్తు ప్రారంభించారు.దివ్యాంగులపై దాడులను తీవ్రంగా పరిగణించాలని ప్రజలు కోరుతున్నారు. బాధితుడు రాకేష్, "వెంకటస్వామి నుంచి ప్రాణభయం ఉంది. నాకు రక్షణ కల్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని పోలీసులను అభ్యర్థించారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్న సీపీఐ



**కల్వకుర్తి, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజల కోసం ప్రజలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ప్రచార యాత్ర ఆదివారం సాయంత్రం కల్వకుర్తి పట్టణానికి చేరుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ యాత్రలో నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు--కూలీల సమస్యలు, విద్యా--వైద్య సౌకర్యాలు పేదలకు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు.ఎల్లికల్, జంగారెడ్డిపల్లి, తిమ్మరాశిపల్లి, సిల్లార్పల్లి, కల్వకుర్తి పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దేశం సైదులు, అమీర్, శేఖర్, కుమార్, పరశురాం యాదవ్, లక్ష్మణ్, రాజేష్, బాలయ్య, ఖదీర్, నాగ రాజు, జనార్దన్, రాజు, పురుషోత్తం, యాదగిరి, శివ, శ్రీను,
మర్రిపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కల్వకుర్తి, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల కేంద్రంలోని ఇందిరా నగర్ కమాన్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఆదివారం యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీస బాల్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా బాల్ రాజు మాట్లాడుతూ, "నాయకులుగా ఎదగడానికి యువజన కాంగ్రెస్ మంచి వేదిక. కల్వకుర్తి మండలం, పట్టణంలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి నా వంతు కృషి చేస్తున్నాను. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి గడప గడపకు తిరిగి ప్రచారం చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీను, మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మావిళ్లపల్లి వంశీ, ఉప సర్పంచ్ రవి, నాయకులు దున్న భాస్కర్, విజయ్ భాస్కర్, కమ్ముల శ్రీకాంత్, శివ, ఎముక శ్రీహరి, కుర్మయ్య, బంగారయ్య,
ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన లక్ష్మి భాయ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా ఎల్లికట్ట ఫ్రెండ్స్ హెల్పింగ్ ఫౌండేషన్ తరఫున మృతురాలి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు యకల భీమయ్య, ఉపసర్పంచ్ బలగం కేశవులు, కంఠం రవి, శాంతి రెడ్డి, టైలర్ ఆంజనేయులు, జంగిలి, వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, జైపాల్ రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో బస్సు ఢీకొని యువకుడు మృతి

**దేవరకొండ, ఆగస్టు 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చందంపేట మండలం పొగిళ్ల గ్రామానికి చెందిన వాయిల్ల శ్రీను (38) ఆదివారం ఉదయం మల్లెపల్లి పనిమీద వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఘోర ప్రమాదం జరిగింది.తన పల్సర్ బైక్ (నెంబర్ టీఎస్05 ఎఫ్ఎఫ్ 6232)పై గుంతల తండా--సర్కిల్ తండాల మధ్య తెల్ల పలుగు గుట్ట వద్దకు చేరుకున్న సమయంలో, పాత కంబాలపల్లి నుండి బయలుదేరిన ఆర్టీసీ బస్సు (నెంబర్ టీఎస్05జెడ్0170) అతివేగంగా వస్తూ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ పూర్తిగా ధ్వంసమైంది.బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఈ ఘటనను ప్రత్యక్షంగా చూశారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ ఎండి ఆలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ లోకేష్ తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ని గద్దె దించాల్సిందే

**- బద్లావ్ జరూరిహై -మార్పు కావాల్సిందే.**
**-సెప్టెంబర్ 1న, ఛలో ఢిల్లీ ని జయప్రదం చేయండి.**
**-ప్రజా చైతన్య యాత్రలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి.**



**దేవరకొండ ఆగష్టు 09.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ని గద్దె దించాల్సిందేనని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)జాతీయ కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు.ఆదివారం
సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్రకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు.డప్పు చెప్పుళ్లతో కళాకారుల పాటల నడుమ గ్రామ పుర వీదుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...విపరీతంగా ధరలను పెంచి సామాన్యులు బతకలేని పరిస్థితిని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని,పెట్రోల్, డిజిల్, వంట గ్యాస్ ధరల పెంపు అడ్డు అదుపు లేకుండా పెంచుతున్నారని ప్రజల పై ఏమాత్రం బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోడీకి చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. విద్యావ్యవస్థను గాడిన పెట్టలేని కేంద్ర బిజెపి సర్కార్ యువత నుండి వస్తున్న వ్యతిరేకతను తగ్గించుకోవడంలో భాగంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ను రంగంలోకి దించిందని,ఢిల్లీ జంతర్ మంతర్ లో ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో యువతరంపై అబద్దాలను ప్రచారం చేస్తూ విదేశీ ఫండ్స్ తోని ఈ దేశంలో పాలకవర్గాలను కూల్చే కుట్రలు చేస్తున్నారని రకరకాల వదంతులు వ్యాప్తి చేస్తూ విద్యార్థులను దేశద్రోహులని ముద్ర వేసి అనేక రకాలుగా తప్పుడు ప్రచారాలు చేయడం సమంజసం కాదని కాదని విద్యార్థులతో పెట్టుకుంటే ఎం జరుగుతుందో మోదీ కళ్లారా చూసారని అన్నారు.ఇవాళ ఏ ముఖం పెట్టుకొని జెన్ జీలు దేశం కోసం పనిచేస్తున్నారనీ, వాళ్ళు అడిగే ప్రశ్నలకు మనం సమాధానాలు చెప్పాలనీ బిజెపికి హితబోధ చేస్తున్న ఆర్ఎస్ఎస్ కపట నీతి ఈతరం యువతరం కి అర్థమైందని అన్నారు.
దేశంలోని విద్యారంగం నుండి మొదలుకొని అనేక రాజ్యాంగబద్ధ సంస్థలకు అధిపతులుగా ఆర్ఎస్ఎస్ సంబంధించిన వారిని నియమించిన తర్వాతనే వ్యవస్థలు పతనావస్థకు చేరుకున్నాయనేది వాస్తవం అన్నారు. 12 ఏళ్ల కాలంలో ఏనాడు బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పైన ఒక్క మాట కూడా మాట్లాడని ఆర్ఎస్ఎస్ ఇవాళ బయటకు వచ్చి పచ్చి మోసం, దగా చేయడానికి విద్యారంగానికి ఆరు శాతం నిధులు కేటాయించాలని ప్రగల్బాలు పలుకుతున్నదని అన్నారు.ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసిన యు వతరంపై ఇంకా వివిధ రాష్ట్రాలలో కేసులు పెడుతూ బెదిరిస్తూ ఇబ్బందులు గురిచేస్తున్న సంఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని కనీస వేతనాలు అందుకోలేని కార్మిక వర్గం శ్రమదోపిడికి గురవుతున్నదని, మరోపక్క ఆర్టిఫిషియల్ ఇంటలిజన్సీ వచ్చిన తర్వాత లక్షలాదిమంది ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కోల్పోతున్న తరుణంలో మరింత నిరుద్యోగాన్ని పెంచే విధంగా బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు చేస్తున్నదని అన్నారు.కొత్త ప్రభుత్వ పరిశ్రమల ఊసులేదని,ఉన్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు.ప్రజల పట్టించుకోని ప్రభుత్వ పథకాలు అందించాల్సింది పోయి కేవలం మత విద్వేషాలను రెచ్చగొడుతూ దేవుళ్ళ పేరుతో బీజేపీ చేస్తున్న రాజకీయం ఎంతో కాలం చెల్లదని అన్నారు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగం,పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడుకునే క్రమంలో సిపిఐ పార్టీ సెప్టెంబర్ 1వ,తారీఖున లక్షలాది మందితో రామ్ లీలా మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు కదలి రావాలని తెలిపారు.అనంతరం ప్రజా చైతన్య యాత్ర బైక్ ర్యాలీ ని జండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనొద్దిన్, మండల డిండి, దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్మ మండల పార్టీ కార్యదర్శులు కనకాచారి, సుదర్శన్ రెడ్డి,వెంకటయ్య, రామాంజనేయులు,సర్పంచ్ ప్రతిమ రెడ్డి,నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరమణ,రామ స్వామి, విజేందర్ రెడ్డి, శైలేష్,రంగారెడ్డి,మండల కార్యవర్గ సభ్యులు,ప్రజా సంఘాల నాయకులు నూనె వెంకటేశ్వర్లు, వెంగలయ్య,ఎనమల్ల నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# వాడని బ్యాంకు ఖాతాలతో సిబిల్ స్కోర్ తగ్గుతుందా




ఈ రోజుల్లో చాలా మందికి చాలా బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి. అయితే వీటిలో అన్నింటినీ వినియోగించని వారుంటారు. వాటి పై దృష్టి పడినప్పుడు వాడని బ్యాంకు ల ఖాతాలు, క్రెడిట్ కార్డులు ఎందుకు మూసివేస్తే అయిపోతుంది కదా అని అనుకుంటారు. ఒకవేళ అలా మూసివేస్తే సిబిల్ స్కోర్ ఏమైనా దెబ్బతింటుందా అన్న అనుమానం వస్తుంది. సిబిల్ స్కోర్ అనేది వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. తిరిగి చెల్లించే అలవాటు, క్రెడిట్ వినియోగం, ఎక్కువ గా రుణ విచారణలు, సుదీర్ఘ క్రెడిట్ చరిత్ర వంటివి ఇందులో ఉంటాయి. అయితే పాత క్రెడిట్ కార్డు లేదా బ్యాంకు ఖాతాను క్లోజ్ చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడవచ్చని, అయితే ఇది మీ మొత్తం క్రెడిట్ ప్రొఫైల్‌పై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**బ్యాంకు ఖాతాల విషయానికివస్తే..**

సేవింగ్స్ లేదా కరెంట్ బ్యాంకు ఖాతాలున్న వారు వాటిలో ఒక దాన్ని మూసివేస్తే దాని వల్ల వారి సిబిల్ స్కోర్‌పై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండదు. ఎందుకంటే డిపాజిట్ ఖాతాల వివరాలను క్రెడిట్ బ్యూరోలకు రిపోర్ట్ చేయకపోవడమే కారణం. అంటే బ్యాంకు ఖాతాలు మీ క్రెడిట్ రిపోర్ట్‌లో భాగం కాదన్న మాట. అయితే మీరు క్లోజ్ చేసే ఖాతా ఒక వేళ మీరు చెల్లించాల్సి ఉన్న రుణ ఈఎంఐలు లేదా క్రెడిట్ కార్డు చెల్లింపుల కోసం లింక్ చేసి ఆటో డెబిట్ ఆదేశాలు ఇచ్చి ఉంటే మాత్రం పరోక్షంగా సిబిల్ స్కోర్‌పై ప్రభావం పడవచ్చు. సదరు ఖాతాను మూసివేసే ముందు మీరు గనక ఆ ఆదేశాలను అప్‌డేట్ చేయకపోయినట్లయితే చెల్లింపులు నిలిచిపోయే అవకాశం ఉంటుంది. అప్పుడు చెల్లింపులు మిస్సయినట్టు క్రెడిట్ బ్యూరోలు రిపోర్ట్ చేయవచ్చు. ఇది మీ క్రెడిట్ ప్రొఫైల్‌ను దెబ్బ తీయవచ్చు. అందుకే ఒక ఖాతాను మూసివేసే ముందు దానితో అనుసంధానం చేసిన ఆటో డెబిట్ మాండేట్‌లను ఒకసారి చూసుకోండి. అలాంటివి ఏమైనా ఉండే వాటిని మీరు ఎక్కువగా వాడుతున్న ఖాతాకు మార్చుకోండి.

**క్రెడిట్ కార్డు క్లోజ్ చేస్తున్నారా..**

ఇక్కడ ఒక విషయం ఏమిటంటే.. మీకున్న క్రెడిట్ కార్డుల్లో ఒకదాన్ని క్లోజ్ చేస్తే మీకు అందుబాటులో ఉండే క్రెడిట్ తగ్గిపోతుందన్న విషయాన్ని గమనించాలి. ఉదాహరణకు మీ దగ్గరున్న క్రెడిట్ కార్డుల మొత్తం క్రెడిట్ పరిమితి రూ.5 లక్షలు అనుకుంటే అందులో మీరు వినియోగించుకునే మొత్తం రూ.లక్ష అయితే మీ క్రెడిట్ వినియోగం 20 శాతం అన్నట్టు. ఒకవేళ మీరు రూ.లక్ష పరిమితి ఉన్న కార్డును మూసివేస్తే మీకు అందుబాటులో క్రెడిట్ రూ.4 లక్షలకు తగ్గిపోయి మీ క్రెడిట్ వినియోగం 25 శాతానికి పెరుగుతుంది. ఇక చాలా కాలంగా ఉంటున్న కార్డును మూసివేయడం వల్ల సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ వల్ల కలిగే ప్రయోజనం కూడా తగ్గవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు..**

సిబిల్ స్కోర్‌ను ప్రభావితం చేసే వాటిలో తిరిగి చెల్లింపు ప్రవర్తన, వివిధ రుణ ఖాతాలు, ఇటీవలి రుణ విచారణలతో పాటు సుదీర్ఘ క్రెడిట్ చరిత్ర అనేది మీ స్కోర్‌ను ప్రభావితం చేసే కీలకమైన అంశాల్లో ఒకటి. సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ.. కాలక్రమేణా మీరు క్రెడిట్‌ను ఎలా నిర్వహించారనే దానిపై రుణ దాతలకు ఒక స్పష్టతను ఇస్తుంది. అలాగే మీరు తిరిగి చెల్లించే విషయంలో అనుసరించే క్రమశిక్షణను అంచ నా చేయడాన్ని సులభతరం చేస్తుంది. అందుకే మీరు బాగా నిర్వహించిన క్రెడిట్ ఖాతా మీ క్రెడిట్ ప్రొఫైల్‌ను మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుంది. ఒకవేళ మీ పాత క్రెడిట్ కార్డును క్లోజ్ చేస్తే మీ క్రెడిట్ హిస్టరీ తగ్గిపోవచ్చు. అప్పుడు మీ స్కోర్‌పైనా ప్రభావం పడవచ్చు. అందుకే అలాంటి కార్డుపై వార్షిక ఫీజు లేనట్టయితే అప్పుడప్పుడూ వాడు తూ యాక్టివ్‌గా ఉంచుకోవడం మేలు. ఎందుకంటే ఇది మీ క్రెడిట్ హిస్టరీని కాపాడటంతో పాటు దీర్ఘకాలంలో బలమైన క్రెడిట్ ప్రొఫైల్‌కూ తోడ్పడుతుంది. మీకు ఎన్ని క్రెడిట్ కార్డులు ఉన్నాయనేది కాకుం డా సకాలంలో తిరిగి చెల్లించడం, క్రమశిక్షణతో కూడిన వినియోగం, పాత క్రెడిట్ కార్డుల నిర్వహణ వంటివి మీ క్రెడిట్ ప్రొఫైల్‌పై అధిక ప్రభావం చూపుతాయి. అందుకే మీరు ఎన్ని క్రెడిట్ కార్డులను నిర్వహించగలుగుతారనే అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. తమ క్రెడిట్ హిస్టరీపై పడే ప్రభావాన్ని పరిశీలించకుండానే కొందరు చాలా ఏళ్లుగా వాడుతున్న తమ పాత క్రెడిట్ కార్డును క్లోజ్ చేస్తుంటారు.

కానీ ఇలాంటి పొరపాటు చేయకపోవడం మంచిది. సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ అనేది క్రెడిట్ ప్రొఫైల్‌లో ముఖ్యమైన అంశంగా గుర్తుంచుకోవాలి. ఇక ఏదైనా క్రెడిట్ కార్డు మూసివేసే ముందు మీరు చెల్లించాల్సిన మొత్తం బకాయిలను చెల్లించండి. అలాగే ఆ కార్డు మీ క్రెడిట్ హిస్టరీకి ఎంతగా దోహదపడుతుందో ఒక్కసారి చూసుకోండి.

# ఈ-వే బిల్లులో కొత్త మార్పు





జీఎస్‌టీ చట్టం ప్రకారం నిర్ణీత విలువకు మించి వస్తువులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించే సందర్భాల్లో ఈ-వే బిల్ తీసుకోవాల్సి ఉంటుందన్న విషయం తెలిసిందే. సాధారణంగా వస్తువులను ఎవరు కొనుగోలు చేస్తారో.. వారికే సరుకు పంపటం జరుగుతుంది. అయితే వ్యాపార లావాదేవీల్లో బిల్లు ఒకరి పేరుతో ఉండి.. సరుకు మాత్రం మరొకరికి పంపే సందర్భాలు చాలానే ఉంటాయి. ముఖ్యంగా డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, పెద్ద కంపెనీలు, ఆన్‌లైన్ వ్యాపారాల్లో ఇటువంటి లావాదేవీలు సాధారణంగా జరుగుతుంటాయి. ఇలాంటి లావాదేవీల్లో సరుకు వాస్తవంగా ఎవరికి చేరుతుందో మరింత స్పష్టంగా తెలుసుకోవటానికి జీఎస్‌టీ నెట్‌వర్క్ ఈ-వే బిల్ విధానంలో కొత్త మార్పు తీసుకువచ్చింది. దీని ప్రకారం బిల్ టు/షి?ప-టు లావాదేవీల్లో సరుకు అంతిమంగా అందుకునే వ్యక్తికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉంటే.. అతని రిజిస్ట్రేషన్ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ సరుకు అందుకునే వ్యక్తికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేకుంటే యూఆర్‌పీ.. అంటే అన్‌రిజిస్టర్డ్ పర్సన్ అని నమోదు చేయవచ్చు. ఈ ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త నిబంధన గురించి వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలి.

బిల్-టు/షిప్-టు అంటే: దీన్ని ఒక ఉదాహరణతో సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఏలూరులో ఉండే అనంత్ అనే వ్యాపారి తనకు కావాల్సిన సరుకును ఎప్పుడు రాజమండ్రిలోని రమేశ్ అనే వ్యాపారి వద్ద కొనుగోలు చేస్తున్నాడు. అలాగే ఈ సారి కూడా తనకు కావాల్సిన వస్తువుల లిస్ట్‌ను రమేశ్‌కు పంపాడు. అయితే తన దగ్గర సమయానికి ఆ వస్తువులు అందుబాటులో లేకపోవటంతో రమేశ్, విజయవాడలోని శ్రీనివాస్ అనే మరో వ్యాపారస్తునికి ఈ ఆర్డర్ మొత్తం పంపాడు. అలాగే సరుకు రాజమండి వచ్చి తిరిగి ఏలూరు పోవటం అంటే సమయం వృధా, రవాణా ఖర్చులు అధికం కూడా. కాబట్టి శ్రీనివ్షసతో ఆ సరుకును నేరుగా అనంత్‌కు పంపమని సూచించటం జరిగింది. వ్యాపార లావాదేవీల్లో ఇలా సరుకు పంపించటం చాలా సాధారణం. ఇక్కడి ఎవరికి ఎవరు కస్టమర్ అని ఆలోచిస్తే రమేశ్‌కు అనంత్ కస్టమర్ కాగా.. శ్రీనివ్షసకు రమేశ్ కస్టమర్. అంటే శ్రీనివాస్ ఇన్వాయిసను రమేశ్‌కు ఇస్తాడు. రమేశ్ తన ఇన్వాయిసను అనంత్‌కు ఇస్తాడు. కానీ సరుకు మాత్రం శ్రీనివాస్ నుంచి నేరుగా అనంత్‌కు చేరుతుంది. దీన్నే బిల్ టు/షిప్ టు విధానం అంటారు. అంటే బిల్ (ఇన్వాయిస్) ఒకరి పేరుతో ఉంటే, షిప్పింగ్ అంటే డెలివరీ వేరే వ్యక్తి పేరుతో ఉంటుంది.

అయితే ఈ విధానం ఈ-వే బిల్ వ్యవస్థలో ఎప్పటి నుంచో ఉంది. కాకుంటే సరుకు వాస్తవంగా అందుకుంటున్న వ్యక్తి అంటే అనంత్‌కు సంబంధించిన జీఎస్‌టీ నంబర్ ఇప్పటి దాకా వేయటం అనేది తప్పనిసరి కాదు. ఇప్పుడు కొత్తగా వచ్చిన నిబంధన ప్రకారం.. శ్రీనివాస్ అనే వ్యక్తి సరుకును రమేశ్ పేరు మీద పంపుతున్నప్పటికీ అది అంతిమంగా చేరేది.

అనంత్‌కు కాబట్టి రమేశ్ జీఎస్‌టీ వివరాలతో పాటు అనంత్ జీఎస్‌టీ వివరాలు కూడా తప్పనిసరిగా నమోదు చేయాలి. ఒకవేళ అనంత్‌కు రిజిస్ట్రేషన్ లేకుంటే 'యూఆర్‌పీ' (అన్ రిజిస్టర్డ్ పర్సన్) అని నమోదు చేయవచ్చు.

# 17 ఏళ్లకే రూ.3.5 కోట్ల స్కాలర్‌షిప్ అమెరికాలో ఫ్రీగా చదువుకునే ఛాన్స్ కొట్టేసిన తమిళనాడు విద్యార్థి





**అమెరికా:** అమెరికాలో చదువుకోవాలనేది ఇండియాలోని లక్షల మంది డ్రీమ్. అక్కడి యూనివర్సిటీల్లో అడ్మిషన్ దొరకడమే కష్టం. ఒకవేళ దొరికినా బోలెడంత డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. చాలా కుటుంబాలకు ఇది భారం. అలాంటిది తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల ఒక విద్యార్థి అమెరికాలోని టాప్ యూనివర్సిటీల్లో ఒకటైన బ్రౌన్ యూనివర్సిటీలో చదువుకునే ఛాన్స్ కొట్టేశాడు. అది కూడా రూ.3.55 కోట్ల స్కాలర్‌షిప్‌తో. అంటే.. నాలుగేళ్ల చదువు పూర్తి ఉచితం. ఈ ఘనత సాధించింది తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన ప్రణవ్ ఇలాంగో అనే 17 ఏళ్ల విద్యార్థి.

ప్రణవ్‌కు చాలాకాలంగా విదేశాల్లో.. అందులోనూ అమెరికాలోని ప్రముఖ యూనివ ర్సిటల్లో చదువుకోవాలనే కోరిక ఉండేది. దీనికి అనుగుణంగా అతడు 13 ఏళ్ల వయసు నుంచే అక్కడి యూనవర్సిటీల్లో అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌ల ప్రక్రియ గురించి తెలుసుకున్నాడు. ఇదే సమయంలో తన అకడమిక్, టెక్నికల్ స్కిల్స్ కూడా పెంచుకున్నాడు. దీనిలో భాగంగా డెక్స్‌టెరిటీ గ్లోబల్ నేషనల్ స్కాలర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో చేరాడు. తన నైపుణ్యాన్ని పెంచుకున్నాడు. మ్యాథమెటిక్స్, పబ్లిక్ హెల్త్‌ను కలపాలన్న తన ఆలోచనకు అనుగుణంగా చదువుకున్నాడు. ఇదే అంశంలో అతడు అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో ప్రతిభ కనిబరిచాడు. రూ.3.55 కోట్ల స్కాలర్‌షిప్ గెలుచుకున్నాడు. 8 ప్రైవేటు యూనివర్సిటీలతో కలిపి ఐవీ లీగ్ యూనివర్సిటీ పేరిట చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రణవ్ ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపి దీని ప్రకారం ప్రణవ్ నాలుగేళ్లపాటు బ్రౌన్ యూనివర్సిటీలో అండర్‌గ్రాడ్యుయేషన్ కోర్స్ చేసేందుకు అనుమతి, సహకారం లభిస్తుంది. ఈ రూ.3.55 కోట్లను యూనివర్సిటీలో చదువుకు, అక్కడ ఉండటానికి, ఇతర ఖర్చులకు కేటాయిస్తారు.

అంటే ట్యూషన్ ఫీజుతో పాటు, నివాస ఖర్చుల కింద నాలుగేళ్లపాటు ఈ మొత్తాన్ని అందిస్తారు.

దీంతో అతడు అక్కడ ఎలాంటి ఖర్చూ లేకుండా చదువు కోవచ్చు.

## లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ అనుమానాస్పద మృతి



పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన సీనియర్ కమాండర్ ఖారీ సయీద్ అబ్దుల్ అజీజ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. లష్కరేకు చెందిన ముసుగు సంస్థ జమాత్ ఉద్ దవాలో ఇతడు కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రార్థనామందిరం ప్రవేశ ద్వారం వద్ద అతడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆ తర్వాత కోలుకో లేదు. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగానా, లేదా విషప్రయోగం కారణంగా మరణించాడా అనేది కచ్చితంగా తెలియరాలేదు. అబ్దుల్ అజీజ్ జమ్ముకశ్మీర్‌లో ప్రవేశించే ఉగ్రవాదులకు సేఫ్ హౌసలు, ఆర్థిక సాయం, తప్పుడు పత్రాలు సమకూర్చడం వంటివి చేస్తుంటాడు. నీలమ్ వ్యాలీ, ముజఫరాబాద్ మీదుగా ఉగ్రవాదులను పంపుతుంటాడు. ఎన్‌కౌంటర్లలో మరణించిన ఉగ్రవాదుల కుటుంబాలకు ఆర్థిక సాయం సమకూర్చడం కూడా ఇతడి బాధ్యత. ఇటీవల లష్కరేకు చెందిన సభ్యుడు రిజ్వాన్ హనీఫ్ ఓ వీడియో విడుదల చేశాడు. తమ సంస్థకు చెందిన 30 మంది సభ్యులను గురుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు ఆరోపించాడు. వీరంతా గత నాలుగేళ్లలో పాక్, పీవోకేలో మరణించినట్లు పేర్కొన్నాడు. ఇటువంటి హత్యలు జరుగుతున్నట్లు లష్కరే బహిరంగంగా అంగీకరించడం ఇదే తొలిసారి.

## పీజీ హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థిని మెడకు వైరు చుట్టి సెక్యూరిటీ గార్డు అత్యాచారం





**గాంధీనగర్:** ఒక విద్యార్థిని పీజీ వసతి గృహంలో నివసిస్తున్నది. రాత్రి వేళ వాకింగ్ కోసం టెర్రస్‌పైకి ఆమె వెళ్లింది. అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు ఆ యువతి మెడకు వైరు బిగించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడి నుంచి పారిపోయిన ఆ నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక యువతి ఇంటీరియర్ డిజైనింగ్ చదువుతున్నది. ఆనంద్‌నగర్ ప్రాంతంలోని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంలో ఆమె నివసిస్తున్నది. కాగా, ఆగస్ట్ 8న డిన్నర్ తర్వాత వాకింగ్ కోసం రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్ బిల్డింగ్ టెర్రస్‌పైకి ఆ యువతి వెళ్లింది. అక్కడ సెక్యూరిటీ గార్డు ఉండటంతో కిందకు వచ్చేందుకు ఆమె ప్రయత్నించింది. అయితే సెక్యూరిటీ గార్డు ఆ మహిళ మెడకు వైరు చుట్టి బంధించాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. గాయాలతో ఉన్న ఆ యువతిని గుర్తించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే స్పందిం చారు. పీజీ హాస్టల్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ సెక్యూ రిటీ గార్డుగా పనిచేస్తున్న ధరమ్ సింగ్‌ను నిం దితుడిగా గుర్తించారు. శనివారం రాత్రంగా వెతికిన పోలీసులు చివరకు ఆదివారం ఉదయం అతడ్ని అరెస్ట్ చేశారు. నిందితుడు ధరమ్ సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాకు చెందిన వ్యక్తిని అని పోలీస్ అధికారి తెలిపారు. కొద్ది రోజుల కిందటే ఆ పీజీ హాస్టల్‌లో సెక్యూరిటీ గార్డుగా అతడు చేరినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు

## జేపీఎస్‌సీ పరీక్ష రద్దుకు సిద్ధం కీలక డిమాండ్లపై


### సానుకూలం విద్యార్థులు చర్చకు రావాలన్న సీఎం



జార్ఖండ్‌లో జేపీఎస్‌సీ–జేఎస్ఎస్‌సీ పరీక్షలు రద్దు చేయాలంటూ విద్యార్థులు చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఈ అంశంపై ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి విద్యార్థులతో చర్చిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ పాల్గొన్నారు. విద్యార్థుల ఆందోళనపై మాట్లాడారు. "జేపీఎస్‌సీ–జేఎస్ఎస్‌సీ పరీక్షల అంశంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. పేపర్ లీకేజీ అంశంలో అవకతవకలకు పాల్పడిన నింది తుల్ని గుర్తించాం. వారికి కఠిన శిక్షలు పడతాయి. జార్ఖండ్‌కు చెందిన అన్ని వర్గాల ప్రజలు, యువత ఆందోళనల్ని మేం పరిగణనలోకి తీసుకుంటాం. బల ప్రయోగం చేయడం, సైన్యాన్ని, బుల్లెట్లు వాడటంకంటే చర్చల ద్వారా పరిష్కారం సాధ్యమవుతుందని మేం నమ్ముతాం. " అని హేమంత్ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు ప్రభావితం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. విద్యార్థులు తమ హక్కులు సాధించుకునేందుకు రాజకీయ జోక్యాన్ని నివారించాలని, రాజకీయ పార్టీలు విద్యార్థుల్ని తప్పుదోవపట్టిస్తాయని ఆయన సూచించారు. ఈ పేపర్ లీకేజీలకు సంబంధించి ప్రధానంగా విద్యార్థులు డిమాండ్ చేస్తున్న కీలక విషయం.. ఇటీవల నిర్వహించిన పరీక్షను పూర్తిగా రద్దు చేయడం. రెండోది వీటిపై సీబీఐ విచారణ జరిపించడం. వీటిలో పరీక్షల రద్దుకు ప్రభుత్వం సానుకూలంగానే ఉన్నట్లు తెలుసోంది. అయితే, సీబీఐ విచారణకే ప్రభుత్వం అంగీకరించడం లేదు. మరోవైపు.. సీఎం మాటల్ని నమ్మి, ప్రభుత్వంతో విద్యార్థులు మళ్లీ చర్చలు జరపాలని జార్ఖండ్ గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ కోరారు. సీఎం హామీపై విశ్వాసం ఉంచాలని ఆయన సూచించారు. విద్యార్థుల భవిష్యత్ విషయంలో ప్రభుత్వం వెనుకంజ వేయదన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల ఆందోళన 16వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో విద్యార్థులతో మరోసారి చర్చలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

## లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐకి ఆహ్వానం వ్యతిరేకిస్తూ 450 మంది విద్యార్థుల సంతకాలు






**హైదరాబాద్:** హైదరాబాద్ లోని ప్రముఖ నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవం అంశంపై వివాదం మొదలైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌ను యూనివర్సిటీ ఆహ్వానించింది. అయితే, సీజేఐని ఆహ్వానించడాన్ని ఇక్కడి విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ వీసీకి 450 మంది విద్యార్థులు లేఖ కూడా రాశారు. హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవం ఇటీవల జరగాల్సి ఉంది. 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న లా విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేసే స్నాతకోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి యూనివర్సిటీ ఏర్పాట్లు చేసింది.

దీనికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వర్గాలు గత నెలలో ఆహ్వానించాయి. అయితే, స్నాతకోత్సవానికి ఆయనను ఆహ్వానించడాన్ని యూనివర్సిటీకి చెందిన అత్యధిక మంది విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. దీనికి కారణం గత నెలలో జరిగిన పరిణామాలు. జూలై 20న సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళన సందర్భంగా అనేక మంది విద్యార్థులు గాయపడ్డారు. వాటికి సంబంధించి సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. ఈ కేసుల విషయంలో సీజేఐ వ్యవహరించిన తీరును నల్సార్ విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థుల తరఫు వాదనల్ని సీజేఐ సరిగ్గా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఆయనను ఆహ్వానించకూడదని నల్సార్ విద్యార్థులు నిర్ణయించారు. ఆయన చేతుల మీదుగా డిగ్రీ పట్టాలు తీసుకోవడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఈ అంశంపై 450 మంది విద్యార్థులు.. తమ సంతకాలతో యూనివర్సిటీ వీసీకి లేఖ రాశారు. స్నాతకోత్సవానికి సీజేఐని ఆహ్వానించాలన్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని వారు లేఖలో కోరారు. ఆయన రావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. వీసీ సహా అధికారులతో ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధమన్నారు. వీరి లేఖ కారణంగానే ఈ కార్యక్రమం వాయిదా పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సీజేఐని ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తే ఆందోళనలు, ఘర్షణ తలెత్తే అవకాశం కూడా ఉందని సమాచారం. అయితే, స్నాతకోత్సవానికి సంబంధించిన డేట్ ఇంకా ఖరారు కాలేదనే మరో ప్రచారం కూడా జరుగుతోంది. ఇక, ఈ అంశంపై ఇప్పటివరకు నల్సార్ యూనివర్సిటీ అధికారికంగా స్పందించలేదు.

## నేను ప్రధానిగా ఉన్నంతకాలం పాలస్తీనా దేశంగా ఉండదు

### ట్రంప్ ప్రతిపాదన తిరస్కరించిన నెతన్యాహు



తాను ప్రధానిగా ఉన్నంతకాలం పాలస్తీనా దేశంగా ఉండబోదని స్పష్టం చేశారు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు. ఈ అంశంలో ట్రంప్ ప్రతిపాదనను కూడా నెతన్యాహు తిరస్కరించారు. ఇది ట్రంప్‌నకు పెద్ద ఎదురుదెబ్బే అని చెప్పాలి. గాజాపై ఇజ్రాయెల్ చాలాకాలంగా దాడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 15 అంశాల ప్రణాళికతో ఒక రోడ్ మ్యాప్ ప్రకటించారు. హమాస్, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలన్నది వాటిలో ఒకటి. ఈ ప్రణాళికకు పాలస్తీనాతోపాటు, ఇతర గల్ఫ్ దేశాలు అంగీకరించాయి. ఇదే సమయంలో హమాస్ సంస్థ కూడా సానుకూలంగా స్పందించింది. అయితే, ఇజ్రాయెల్ తమ డిమాండ్లకు అంగీకరించాలని హమాస్ కోరింది. కానీ, ఈ ప్రతిపాదనను ఇజ్రాయెల్ పీఎం వ్యతిరేకించారు. ట్రంప్ ప్రతిపాదనకు అంగీకరించేది లేదన్నారు. తాను ప్రధానిగా ఉన్నంతకాలం పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించబోమన్నారు. గాజాలో లేదా వెస్ట్‌బ్యాంక్‌లో ఎక్కడా పాలస్తీనా దేశాన్ని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రతిపాదనల్లో పాలస్తీనా దేశం ఏర్పాటు కూడా ఒకటి. అయితే, దీన్ని నెతన్యాహు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు.. ట్రంప్ ప్రతిపాదనను నెతన్యాహు వ్యతిరేకించడాన్ని 8 దేశాలు వ్యతికేస్తున్నాయి. యూఏఈ, ఖతార్, జోర్డాన్, ఇండోనేసియా, పాకిస్తాన్, తుర్కియే, సౌదీ అరేబియా, ఈజిప్టులు నెతన్యాహు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. గాజాలో ఇంకా ఎంతకాలం ఇజ్రాయెల్ దాడులు చేస్తుందని ప్రశ్నిస్తున్నాయి.

ఇజ్రాయెల్ ఈ శాంతి ఒప్పందానికి అంగీకరించకుంటే తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించాయి. గాజా నుంచి ఇజ్రాయెల్ దళాల్ని ఉపసంహరించేది లేదన్నారు. హమాస్ ఉగ్రవాదులు పూర్తి నిరాయుధులుగా మారేంతవరకు తమ దళాలు అక్కడే ఉంటాయన్నారు. ఇదే సమయంలో ఇరాన్‌పై కూడా భారీ దాడికి ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే ఇజ్రాయెల్ సైన్యానికి సెలవులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ఇరాన్‌పై దాడికి ముందు కూడా ఇలాగే సెలవులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## కెనడాలో విజృంభిస్తున్న కార్చిచ్చు 20000 మందికి ముప్పు బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటన




కెనడాలో కార్చిచ్చు విజృంభిస్తోంది. కొద్ది రోజులుగా బ్రిటీష్ కొలంబియా ప్రాంతంలో కొనసాగుతున్న కార్చిచ్చు మరింత వేగంగా విస్తరిస్తోంది. వేల ఎకరాల అడవి తగలబడిపోతోంది. దీంతో కెనడా ప్రభుత్వం బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ ప్రాంతంలోని 20,000 మందిని సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని ఆదేశించింది. బాధితుల్ని రక్షించే సహాయక చర్యల్ని కొనసాగిస్తోంది. కార్చిచ్చు వేగంగా విస్తరిస్తుండటం వల్ల బ్రిటీష్ కొలంబియాలో ఎమర్జెన్సీ ప్రకటిం చామని అధికారులు తెలిపారు. అక్కడి అధికారుల వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 100 అడుగులు (30 మీటర్లు) ఎత్తులో మంటలు ఎగసిపడుతున్నాయి. ఇవి 200 అడుగుల వరకు కూడా చేరుకునే అవకాశం ఉంది. పైగా ఈ మంటలు కృత్రిమ వాతావరణాన్ని సృష్టించి, మెరుపులు ఏర్పడేలా కూడా చేస్తుంది. కార్చిచ్చు విస్తరిస్తుండటంతో ఇప్పటికే భారీ ఆస్తి నష్టం జరిగింది. అనేక ఇళ్లు, కార్లు, ఆస్తులు కాలి బూడిదయ్యాయి. కొన్నిచోట్ల మంటలు వేగంగా వ్యాపించడంతో చాలా మంది మధ్యలో చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కొన్నిచోట్ల మంటలు మొదలవ్వగా, అర్ధరాత్రి వరకు భారీగా వ్యాపించాయి. శనివారం ఒక్క రోజే 9,500 హెక్టార్ల (23,500 ఎకరాలు)కు మంటలు వ్యాపించాయి. దీంతో 12,000 మంది పౌరులు ఇక్కడినుంచి తరలి వెళ్లాల్సి వచ్చింది. ముఖ్యంగా సమ్మర్‌ల్యాండ్‌లో మొదలైన కార్చిచ్చు చాలా ప్రమాదకరంగా మారింది. గత వారం నుంచి ఇక్కడ 70 చోట్ల కార్చిచ్చు వ్యాపించింది. అంతకుముందు వాటితో కలిపి 105 చోట్ల కార్చిచ్చు కొనసాగుతోందని బ్రిటీష్ కొలంబియా అటవీ శాఖ మంత్రి రవి పర్మార్ ప్రకటించారు. ఈ ఏడాదిలో కెనడాలో అనేకచోట్ల కార్చిచ్చు వ్యాపించి, భారీ నష్టాన్ని కలిగించింది.

2026లో 4 మిలియన్ల హెక్టార్లలో కార్చిచ్చు వ్యాపించి, వినాశనం సృష్టించింది. ముఖ్యంగా ఒంటారియో, క్యూబె క్ వంటి వేడిగా, పొడిగా ఉండే ప్రదేశాల్లోని అటవీ ప్రాంతాలు తగలబడిపోయాయి. కొన్నేళ్లుగా దేశంలో కార్చిచ్చు ఘటనలు ఎక్కువగా జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

## అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి

### తామే చేశామని ప్రకటించిన హౌతీలు




సౌదీ అరేబియా లోని జజాన్‌లో ఉన్న అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి చేసినట్లు హౌతీలుప్రకటించారు. ఈ దాడికి తామే కారణమని హౌతీ సైనిక ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ యహ్యా సరీ తెలిపారు. తమ గగనతలంలో సౌదీ డ్రోన్ల చొరబాటుకు ప్రతిస్పందనగానే దాడి చేసినట్లు వెల్లడించారు. సౌదీ 'మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీ' కూడా ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగినట్లు ధ్రువీకరించింది. అయితే అగ్నిమాపకసిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. ఓ వైపు అమెరికా–ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఈ దాడి ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు కొద్ది రోజుల ముందే పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కీయే దేశాలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పై సంతకాలు చేశాయి. మూడు దేశాల్లో ఏదైనా ఒకదానిపై సాయుధ దాడి జరిగితే మూడింటిపై జరిగిన దాడిగానే పరిగణించేలా ఒప్పందంలో పేర్కొన్నారు. ప్రాంతీయ భద్రతపై ఉద్రిక్తతలు పెరుగుతున్న ప్రాధాన్యం సంతరించుకుంది.

# కోకాబుర్రా బంతులు శ్రీలంక పిచ్‌లు

## పడిక్కల్ శతక రహస్యమిదే

‘నయావాల్’ ఛతేశ్వర్ పూజారా వీడ్కోలు అనంతరం మూడో స్థానంలో నిఖార్సైన ఆటగాడి కోసం ఎదురుచూస్తున్న భారత జట్టు నిరీక్షణకు తెరపడేలా ఉంది. సాయి సుదర్శన్ గాయంతో శ్రీలంక పర్యటనకు దూరమవ్వగా.. అవకాశాన్ని అందిపుచ్చుకున్న దేవ్‌దత్ పడిక్కలశతకంతో చెలరేగాడు. ఓపెనర్లు విఫలమైనా గోడలా వికెట్ల పతనాన్ని అడ్డుకుంటూ.. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పుతూ లంక బౌలర్ల భరతం పట్టిన పడిక్కల్ నేను సరైనోడిని అని నిరూపించుకున్నాడు. లంకపై అంతలా విజయవంతమవ్వడానికి పక్కా ప్లాన్‌తో సాధన చేశాడీ లెఫ్ట్ హ్యాండర్.



విదేశీ పర్యటనల్లో రాణించాలంటే అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ప్రత్యర్థి బౌలర్ల బల హీనతలను పసిగట్టి.. జట్టును ఆదుకునే ఇన్నింగ్స్‌లు ఆడాలి. మూడో స్థానంపై కన్నేసిన సాయి సుదర్శన్ గాయం నుంచి కోలుకోలేదు. కరుణ్ నాయర్, వాషింగ్టన్ సుందర్‌లు సైతం స్క్వాడ్‌లో లేరు. ఈ పరిస్థితుల్లో భారీ సెంచరీ కొడితే.. జట్టును గట్టెక్కిస్తే చాలు మరిన్ని అవకాశాలు వస్తాయి. వామప్ మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్ అదే పని చేశాడు.

లంక పర్యటనకు ఎంపికవ్వగానే అతడు తన బ్యాటింగ్ సన్నద్ధతను మార్చాడు. బెంగళూరులో తన చిన్నప్పటి కోచ్ మొహమ్మద్ నసీరుద్దీన్ తో కలిసి వర్కవుట్ చేశాడు. కోకాబుర్రా బంతులు, శ్రీలంక తరహా పిచ్‌లను తయారు చేయించుకొని బ్యాటింగ్ చేయడం ద్వారా అతడు వామప్ మ్యాచ్‌లో శతకం సాధించగలిగాడు.

# టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్

## నబి సిరాజ్ చెలరేగేనా



వామప్ మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్(142 నాటౌట్) భారీ శతకంతో కోలుకున్న భారత జట్టు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రెండోరోజు ఓవర్ నైట్ స్కోర్ 357/6 వద్దే ఆటను ఆపేసిన టీమిండియా.. శ్రీలంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంకను పేసర్లు అకిబ్ నబీ, సిరాజ్‌లు వికెట్ల వేటతో దెబ్బకొడితే మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించడం ఖాయం. శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు సన్నాహక మ్యాచ్‌లో భారత జట్టు ఆదిలో తడబడినా చివరకు నిలబడింది. మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా(142 నాటౌట్) భారీ శతకంతో రెచ్చిపోయాడు. కేఎల్ రాహుల్(41), రవీంద్ర జడేజా(63 రిటైర్డ్ హర్ట్)లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్.. ఆఖరి ఓవర్ వరకూ క్రీజునంటుకుపోయాడు.

మానవ్ సుతార్(41) సైతం గొప్పగా ఆడడంతో టీమిండియాను ఆలౌట్ చేయాలనుకున్న లంక బౌలర్ల ఆశలు ఆవిరయ్యాయి. ఓవర్‌నైట్ స్కోర్ 357/6తో రెండో రోజు ఆటను ముగించిన భారత్.. మూడో రోజు తొలి బంతికి ముందే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలెట్టిన లంక 3 ఓవర్లకు ఏడు పరుగులు చేసింది. ప్రస్తుతానికి లంక 13 పరుగుల ఆధిక్యంలో ఉంది.

# హై జంప్‌లో భారత్‌కు తొలి రజతం

## చరిత్ర సృష్టించిన బసంత్

అమెరికాలోని ఒరెగా వేదికగా జరుగుతున్న అండర్ 20 ఛాంపియన్‌షిప్స్ 2026లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. జావెలిన్ త్రోలో పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ అశిష్ యాదవ్‌రజతం కొల్లగొట్టగా.. హై జంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ చరిత్ర సృష్టించాడు. పురుషుల ఫైనల్లో సత్తా చాటిన బసంత్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో వెండి వెలుగులు విరజిమ్మాడు.

అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత కుర్రాళ్లు రికార్డులు పట్టేస్తున్నారు. జావెలిన్ త్రోలో భావి తారగా ఎదుగుతున్న అశీష్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించిన మరునాడే.. హై జంపర్ బసంత్ కుమార్ మేఘ్వాల్ సైతం వెండి పతకం గెలుపొందాడు. ఆదివారం జరిగిన






ఫైనల్లో భారత అథ్లెట్ రెండో ప్రయత్నంలో ఏకంగా 2.21 మీటర్ల ఎత్తు దూకాడు. తద్వారా వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు హై జంప్‌లో తొలి పతకం సాధించిన బసంత్ చరిత్రకెక్కాడు. లాంగ్ జంప్‌లో షహన్వాజ్ ఖాన్ కాంస్యంతో మెరిశాడు. శనివారం పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో అశీష్ యాద వ్ 74.09 మీటర్ల దూరం ఈటెను విసిరి రెండో స్థానంతో రజతం పట్టేసిన విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం నీరజ్ పసిడి గెలిచిన ఈ టోర్నీలో అశీష్ అంచనాలు అందుకుంటూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు.

# శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్

## టీమిండియా ఘన విజయం




శ్రీలంక ఎలెవన్‌తో కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల వార్మప్ టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడో రోజు 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యశస్వి జైస్వాల్(61లి) హాఫ్ సెంచరీ చేసి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. గాయం బారిన పడిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్(44) నేడు బ్యాట్ పట్టాడు. స్టార్ బౌలర్ సిరాజ్(32లి) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆఖరిలో హ్యాట్రిక్ సిక్సర్లు బాది ఆశ్చర్య పరిచాడు. శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో కేషారా 2 విశ్వా ఫెర్నాండో, రమేశ్ మెండీస్ తలోక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి రోజు వికెట్లు తీయడానికి ఇబ్బంది పడిన భారత బౌలర్లు.. రెండో రోజు రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 357/6 వద్ద డిక్లేర్ ఇచ్చింది. దేవదత్ పడిక్కల్(142లి) సూపర్ సెంచరీ చేశాడు. రవీంద్ర జడేజా(63లి) రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 200/6 వద్ద డిక్లేర్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌తో కలిపి 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. అద్భుతంగా ఛేదించింది.

# షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌లో అభిషేక్ శర్మ గిల్

## ఏ జట్ల తరఫున ఆడనున్నారంటే

పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) ఆధ్వర్యంలో తొలిసారిగా జరగనున్న షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌కు స్టార్ క్రికెటర్లు సిద్ధమయ్యారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యువ సంచలనం అభిషేక్ శర్మలను అధికారులు మార్కీ ప్లేయర్లుగా ప్రకటించారు. దీంతో తొలి సీజన్‌లోనే ఈ లీగ్‌కు భారీ క్రేజ్ లభించింది. గిల్ ఫజిల్కా ఫాల్కన్స్ తరఫున బరిలోకి దిగనుండగా.. అభిషేక్ శర్మ అమృత్‌సర్ సూర్మాస్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. వీరితో పాటు స్టార్ ప్లేయర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్‌లు కూడా మార్కీ ప్లేయర్లుగా వివిధ జట్లకు ఎంపికయ్యారు. ఆరు జట్లతో జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 27 మ్యాచ్‌లు ఉంటాయి. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 13 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. న్యూ చండీగఢ్‌లోని పీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్





స్టేడియంలో లీగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. పంజాబ్ నుంచి మరింత మంది ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలుగులోకి తీసుకురావడమే ఈ లీగ్ ప్రధాన లక్ష్యమని పీసీఏ పేర్కొంది. తన స్వస్థలం ఫజిల్కాకు చెందిన గిల్ కూడా ఈ టోర్నీపై ఆశాభావం వ్యక్తం చేశాడు. ‘పంజాబ్ ఎప్పటినుంచో గొప్ప క్రికెటర్లను భారత జట్టుకు అందిస్తోంది. ఈ లీగ్ ద్వారా మరింత మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని నమ్ముతున్నా’ అని గిల్ తెలిపాడు.

**అదే లక్ష్యం..**

షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌లో రౌండ్ రాబిన్ విధానంలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో ఫ్రాంచైజీకి ఒక మార్కీ ప్లేయర్‌తో పాటు కనీసం ఇద్దరు ఐకాన్ ప్లేయర్లను తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి జట్టుకు రూ.45 లక్షల బడ్జెట్ కేటాయించగా.. గరిష్ఠంగా 20 మంది ఆటగాళ్లతో స్క్వాడ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.

యువ క్రికెటర్లకు స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడే అవకాశం కల్పించి.. వారిని ఉన్న త స్థాయి క్రికెట్‌కు సిద్ధం చేయడమే ఈ లీగ్ ప్రధాన ఉద్దేశమని పీసీఏ భావిస్తోంది.

పం జాబ్ క్రికెట్‌కు మరింత మంది ప్రతిభావంతులను అందించే వేదికగా షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌ను తీర్చిదిద్దాలని భావిస్తోంది.

# బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా

## కేంద్రం అనుమతి కోరనున్న బీసీసీఐ

భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ పర్యటనపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బోర్డు సొంతంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, త్వరలోనే కేంద్రాన్ని సంప్రదించనున్నట్లు బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అయితే తమ దేశానికి రావాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఇప్పటికే బీసీసీఐకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. రెండు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నాయని బీసీసీఐ అధికారి తెలిపారు. త్వరలోనే పర్యటనపై మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 15 వరకు భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు బంగ్లాదేశ్ షెడ్యూల్ విండోను కేటాయించింది. ఇందులో మూడు వన్డేలు, మూడు టీ20లు ఉన్నాయి. సెప్టెంబర్ 1, 3, 6 తేదీల్లో వన్డేలు.. సెప్టెంబర్ 9, 12, 13 తేదీల్లో టీ20లు జరగాల్సి ఉంది. ఆగస్టు 28న భారత జట్టు బంగ్లాదేశ్‌కు చేరుకోవాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ అనుమతిపైనే పర్యటన ఆధారపడి ఉన్నట్లు సమాచారం.

**ముస్తాఫిజుర్ వివాదంతోనే..**

భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ సంబంధాల్లో గత కొంతకాలంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పర్యటనపై అనిశ్చితి కొనసాగుతోంది. 2026 ఐపీఎల్ వేలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఆ తర్వాత బీసీసీఐ ఆదేశాలతో అతడిని జట్టు నుంచి విడుదల చేయాల్సి వచ్చింది. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ తీవ్రంగా స్పందించింది. అనంతరం భద్రతా కారణాలను చూపుతూ 2026 టీ20 ప్రపంచకప్ కోసం భారత పర్యటనకు తమ




జట్టు రాదని బీసీబీ ప్రకటించింది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్ నుంచి ఇతర వేదికలకు మార్చాలని ఐసీసీని కోరింది. ఈ వివాదం అంతర్జాతీయ క్రికెట్‌కే పరిమితం కాలేదు. ముస్తాఫిజుర్ వ్యవహారం నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారం, ప్రచారాన్ని ఆ దేశ ప్రభుత్వం నిరవధికంగా నిలిపివేసింది.

**గతంలోనూ వాయిదా..**

భారత జట్టు 2025 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే అంతర్జాతీయ క్రికెట్ కట్టుబాట్లు, షెడ్యూల్ సౌలభ్యం కారణంగా ఆ పర్యటనను 2026 సెప్టెంబర్‌కు వాయిదా వేశారు. ఇప్పుడు ఈ సిరీస్ ఇరు దేశాల క్రికెట్ సంబంధాలకు కీలకంగా మారింది. బంగ్లా-భారత్ మధ్య మ్యాచ్ నిర్వహించాలని బీసీబీ పట్టుదలగా ఉంది. ఇరు బోర్డుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చే నిర్ణయంపైనే సిరీస్ భవితవ్యం ఆధారపడి ఉంది. ఈ పర్యటన జరిగితే గత కొంతకాలంగా దెబ్బతిన్న భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఉపయోగపడుతుందని బీసీబీ ఆశిస్తోంది.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లో కీలక మార్పులు కోచింగ్

## బృందంలో గంగూలీ యువరాజ్ సింగ్

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. భారత క్రికెట్ దిగ్గజాలు సౌరభ్ గంగూలీ, యువరాజ్ సింగ్ బెంగళూరులోని జస్ట్ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో కనిపించడంతో ఈ చర్చ మొదలైంది. డీసీ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా గంగూలీ మళ్లీ బాధ్యతలు నిర్వర్తించనున్నాడంటూ గత కొంతకాలంగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా యువీ, గంగూలీ ఢిల్లీ శిక్షణ శిబిరంలో కనిపించడంతో సహాయక బృందంలో భారీ మార్పులు ఉండొచ్చన్న వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ శిక్షణ శిబిరంలో యువరాజ్ నెట్స్ వద్దే ఉండి యువ బ్యాటర్లకు సాంకేతిక సూచనలు చేశాడు. ముఖ్యంగా పవర్ హిట్టింగ్ మెరుగుపరుచుకోవడంపై




ప్లేయర్లకు సలహాలు ఇస్తూ కనిపించాడు. మరోవైపు గంగూలీ జట్టు కూర్పు, భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించినట్లు సమాచారం. భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా కూడా శిబిరంలో పాల్గొని స్థానిక బౌలర్ల ప్రతిభను పరిశీలించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ మాత్రం ఈ విషయం గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా గంగూలీ మరోసారి జట్టులో కీలక బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా వ్యూహాత్మక వ్యవహారాలను పర్యవేక్షించే అవకాశం ఉంది. ఇక యువరాజ్ సింగ్ ఐపీఎల్‌లో తొలిసారి బ్యాటింగ్ మెంటార్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల కాలంలో యువరాజ్ సింగ్ పలువురు యువ బ్యాటర్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లు అతడి సూచనలను ప్రశంసించారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ విభాగానికి యువరాజ్ మార్గదర్శకత్వం కలిసొస్తుందని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు సమాచారం. వచ్చే సీజన్ నుంచి జేఎస్‌డబ్ల్యూ సంస్థ పూర్తిస్థాయి నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో సపోర్ట్ స్టాఫ్‌తో పాటు ఆటగాళ్ల ఎంపికలోనూ భారీ మార్పులు ఉండే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఐపీఎల్ టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్.. ఈసారి పక్కా ప్రణాళికతో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఢిల్లీ అభిమానులకు మరో గుడ్ న్యూస్ కూడా ఉంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నుంచి స్టార్ ప్లేయర్ రిషభ్ పంత్‌ను తిరిగి జట్టులోకి తీసుకొచ్చే ప్రక్రియను ఫ్రాంచైజీ పూర్తి చేసింది. గంగూలీ వ్యూహాలు.. యువరాజ్ బ్యాటింగ్ మంత్రాలు.. పంత్ నాయకత్వం కలిస్తే ఢిల్లీ క్యాపిటల్స్ రూపురేఖలు పూర్తిగా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# విజయ్ సేతుపతి స్లమ్ డాగ్ నుంచి అదిరిపోయే

## అప్డేట్ ఇంటెన్స్ లుక్‌లో టబు

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలుపెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది.ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది.




# ఓటీటీలోకి స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే రూ.12 వేల

## కోట్ల వసూళ్లతో దూసుకెళ్తున్న మూవీ స్ట్రీమింగ్ ఎప్పుడంటే

మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ సోనీ పిక్చర్స్ కాంబినేషన్‌లో టామ్ హాలండ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా భారతదేశంలోనూ స్పైడర్ మ్యాన్‌కు ఉన్న క్రేజ్ మరోసారి స్పష్టమైంది. భారత్‌లో ఐమాక్స్ స్క్రీన్లు అందుబాటులో లేకపోయినప్పటికీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' తొలి మూడు రోజుల్లోనే సుమారు రూ.309 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. దీంతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా కొత్త రికార్డులు నమోదు చేస్తోంది.ఇక అంతర్జాతీయ మార్కెట్‌లోనూ స్పైడీ దూకుడు కొనసాగుతోంది. విడుదలైన వారం రోజులు పూర్తికాకముందే ఈ చిత్రం 1 బిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు తెలుస్తోంది. 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' తర్వాత ఇంత వేగంగా ఈ మైలురాయిని చేరుకున్న చిత్రాల్లో ఇదొకటిగా నిలిచింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.12 వేల కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే 2 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి కూడా అడుగుపెట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకెళ్తున్న 'బ్రాండ్ న్యూ డే' ఓటీటీ రిలీజ్‌పై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ 2026లో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.అయితే, థియేట్రికల్ రన్ ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై ఓటీటీ విడుదల తేదీ ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సినిమా భారీ వసూళ్లు సాధిస్తున్న నేపథ్యంలో డిజిటల్ రిలీజ్‌ను కొంత ఆలస్యం చేసే అవకాశం కూడా ఉందనే ప్రచారం జరుగుతోంది. సోనీ పిక్చర్స్‌కు సంబంధించిన గ్లోబల్ డిజిటల్ డీల్ ప్రకారం ఈ సినిమా థియేట్రికల్ రన్ పూర్తైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే భారతదేశానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ విషయంలో మాత్రం పరిస్థితి కొంత భిన్నంగా ఉండొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఇండియాలో మార్వెల్‌కు సంబంధించిన పలు సినిమాలు, ముఖ్యంగా వీజఖ కంటెంట్ జియోహాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది. 'స్పైడర్ మ్యాన్: నో వే హోమ్' కూడా అక్కడే స్ట్రీమింగ్ అవుతోంది. దీంతో 'బ్రాండ్ న్యూ డే' కూడా భారతీయ ప్రేక్షకుల కోసం జియోహాట్‌స్టార్‌లోకి వచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే నెట్‌ఫ్లిక్స్, జియో హాట్‌స్టార్‌లో ఏ ప్లాట్‌ఫామ్ ఈ సినిమా డిజి టల్ హక్కులను దక్కించుకుంటుందనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# మహేశ్‌బాబు పుట్టినరోజు వేళ శుభాకాంక్షల వెల్లువ

## చిరంజీవి పవన్ వెంకటేష్ ప్రత్యేక విషెస్

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా మొత్తం శుభాకాంక్షలతో హోరెత్తుతోంది. ఆగస్టు 9న మహేశ్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు ప్రత్యేకంగా విషెస్ చెబుతున్నారు. మహేశ్ సినీ ప్రయాణం, సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ పలువురు స్టార్ హీరోలు ఆయనపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి మహేశ్‌బాబుకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఎదుగుదలను ఎన్నో ఏళ్లుగా చూస్తూ రావడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని చిరంజీవి పేర్కొన్నారు.భారతీయ సినిమాలో అత్యంత ప్రేమాభిమానాలు పొందుతున్న ప్రముఖ నటుల్లో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని అన్నారు. భగవంతుడు ఎల్లప్పుడూ మహేశ్‌ను ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు చిరంజీవి తెలిపారు. మరోవైపు మహేశ్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతూ పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ కూడా ప్రత్యేక సందేశాన్ని పంచుకుంది. సూపర్‌స్టార్ మహేశ్‌బాబుకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, మరెన్నో విజయాలు దక్కాలని ఆకాంక్షించింది. ముఖ్యంగా మహేశ్ బాబు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రశంసించారు. చిన్నారులకు సహాయం చేయడంలో ఆయన చూపిస్తున్న నిబద్ధత, మానవతా దృక్పథం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారువిక్టరీ వెంకటేష్ కూడా తనదైన శైలిలో మహేశ్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'నా చిన్నోడు మహేష్' అంటూ ఆప్యాయంగా సంబోధించిన వెంకటేష్.. మహేశ్ జీవితంలో ఎల్లప్పుడూ ప్రేమ, నవ్వులు నిండాలని ఆకాంక్షించారు. అంతేకాదు, మహేశ్ నటిస్తున్న 'వారణాసి'పై కూడా వెంకటేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో రుద్ర పాత్రలో మహేశ్ రగ్గడ్‌గా, హ్యాండ్సమ్‌గా కనిపిస్తున్నాడని ప్రశంసించారు. వచ్చే ఏడాది 'వారణాసి'తో మహేశ్ ప్రపంచాన్ని ఏలబోతున్నాడని పేర్కొంటూ.. ఆ సినిమాను చూసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. మహేశ్‌బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మహేశ్ లుక్స్ ఇప్పటికే అభిమానుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. రుద్ర పాత్రలో మహేశ్ కనిపించిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కూడా భారీ ఎత్తున సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నారు. థియేటర్లలో ఆయన పాత సినిమాల రీ-రిలీజ్‌లు, ప్రత్యేక కార్యక్రమాలు, సోషల్ మీడియాలో ట్రెండ్స్‌తో సూపర్‌స్టార్ బర్త్‌డేను ఘనంగా జరుపుకుంటున్నారు.



# వైజాగ్ సినీ ప్రియులకు గుడ్ న్యూస్

### విశాఖలో ఏఏఏ సినిమాస్'ని ఘనంగా ప్రారంభించిన అల్లు అర్జున్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన థియేటర్ల వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ నగరమైన విశాఖపట్నంలో అత్యాధునిక హంగులతో కూడిన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్‌ను ప్రారంభించారు.వైజాగ్‌లోని ఇనార్బిట్ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక థియేటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఏషియన్ సినిమాస్ తో కలిసి అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువెళ్తున్నారు. ఈ మల్టీప్లెక్స్ విశాఖ సినీ ప్రియులకు ఒక సరికొత్త మరియు ప్రపంచస్థాయి సినిమా అనుభూతిని అందించనుంది.

ఇది ఆంధ్రప్రదేశ్లోనే అతిపెద్ద ఎల్ఈడీ సినిమా స్క్రీన్ అని తెలుస్తుంది. భారత దేశంలోనే మొట్టమొదటి ఎల్ఈడీ ప్రొజెక్షన్ క్యూ-లక్సన్ స్క్రీన్‌ను ఇందులో అమర్చారు. మొత్తం 8 స్క్రీన్లతో, 1,556 సీటింగ్ సామర్థ్యంతో పాటు విఐపి అతిథుల కోసం ప్రత్యే కంగా 'ఐకాన్ స్టార్ లాంజ్' మరియు '82 లాంజ్'లను ఏర్పాటు చేశారు.

# అల్లరి నరేష్ కొత్త సినిమా రంభ

## ఊర్వశి మేనక టీజర్ డేట్ ఫిక్స్

టాలీవుడ్ కామెడీ కింగ్ అల్లరి నరేష్ తన సిగ్నేచర్ కామెడీ జోనర్‌తో మరోసారి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక' ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ సినిమా నుంచి ఆగస్టు 11న టీజర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. టీజర్ డేట్‌లో మాత్రమే చిన్న సర్దుబాటు... ఎంటర్‌టైన్‌మెంట్‌లో మాత్రం ఎలాంటి సర్దుబాట్లు ఉండవు" అంటూ చిత్ర యూనిట్ ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ టీజర్ ఆగస్టు 11న గ్రాండ్‌గా లాంచ్ కానుంది. అల్లరి నరేష్ పాత కామెడీ టైమింగ్‌ను గుర్తుచేసేలా ఈ సినిమా ఉండబోతుందని పోస్టర్లు చూస్తేనే అర్థమవుతోంది. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన సురభి హీరోయిన్‌గా నటిస్తుండగా, చంద్రమోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా, లెమన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లరి నరేష్ మార్క్ ఫుల్-ఆన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో రాబోతున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4, 2026న ఘనంగా విడుదల కానుంది. థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించేందుకు రెడీ అవుతున్న ఈ సినిమా టీజర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# వీసా కారణంగా సిడ్నీ స్టేజ్ షో రద్దు అభిమానులకు

## క్షమాపణలు చెప్పిన మోహన్ లాల్

ఆస్ట్రేలియాలోని సిడ్నీ వేదికగా జరగాల్సిన తన లైవ్ స్టేజ్ షో వీసా సమస్య కారణంగా వాయిదా పడటంతో మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఊహించని పరిణామం పట్ల ఆయన అభిమానులకు, నిర్వాహకులకు క్షమాపణలు చెబుతూ సింగపూర్ నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తన 50 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు.సింగపూర్ లో ఉన్న తనకు ఆస్ట్రేలియా వీసా సమయానికి రాకపోవడం వల్లనే తాను సిడ్నీ వెళ్లలేకపోయానని, అయితే సింగర్ కేఎస్ చిత్రతో సహా మిగతా బృందమంతా ఇప్పటికే సిడ్నీ చేరుకున్నారని ఆయన తెలిపారు. ఇది టెక్నికల్ లేదా క్లెరికల్ పొరపాటు కావచ్చని, దీనికి ఎవరిని తాను బ్లేమ్ చేయదలచుకోలేదని, ఈ తప్పు పూర్తిగా తనదేనంటూ మొత్తం బాధ్యతను తానే మోస్తున్నట్లు మోహన్ లాల్ స్పష్టం చేశారు. ఈ ప్రదర్శన కోసం చాలా దూరం నుండి డ్రైవ్ చేసుకుని వచ్చిన ప్రేక్షకులకు హృదయపూర్వక క్షమాపణలు తెలుపుతున్నానని, తాను పూర్తిగా అసహాయ స్థితిలో ఉన్నానని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. త్వరలోనే అదే టీమ్‌తో మళ్లీ సిడ్నీకి వచ్చి అద్భుతమైన షోను నిర్వహిస్తామని ఆయన అభిమానులకు గట్టి హామీ ఇచ్చారు.



# వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్ ట్రైలర్ వచ్చేది ఆరోజే

భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారుకాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగస్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకనిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తోకానుంది.

# కొరియన్ కనకరాజు దూకుడు కొడుకు

## సినిమా హిట్‌పై నాగబాబు ఎమోషనల్ ట్వీట్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద జోరు చూపిస్తోంది. రాయలసీమ నేటివిటీకి కొరియన్ కల్చర్‌ను జోడించి తెరకెక్కించిన ఈ విభిన్నమైన కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆగస్టు 7న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు తొలి షో నుంచే మంచి స్పందన రావడంతో కలెక్షన్ల పరంగా కూడా దూసుకెళ్తోంది.ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా.. సత్య తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నారు. అనంతపురం జిల్లా పెనుగొండ నేపథ్యంలో సాగే ఈ కథలో కనకరాజు అనే పల్లెటూరి యువకుడిని ఓ కొరియన్ ఆత్మ ఆవహిస్తుంది. ఆ తర్వాత అతడి జీవితంలో చోటుచేసుకునే విచిత్రమైన పరిణామాలు, కామెడీ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.'కొరియన్ కనకరాజు' విడుదలైన తొలి రోజే దాదాపు రూ.10.2 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.మంచి ఆక్యుపెన్సీతో కొనసాగింది.